ఆదివారం
ప్రజాశక్తి
ఆగస్టు 10, 2003

అనంత సేవలో 'ఆకాశవాణి'

హ్యాపీ బర్త్‌డే

(10-8-2003 నుండి
16-8-2003 వరకు)

జి.రాజేంద్ర
ఆగస్టు
పుష్పరాణి-సాంబశివరావు
హైదరాబాదు

ఉప్పల పవిత్ర
3॥సం, ఆగస్టు-2000
మమత- యోగానందస్వామి
జైనూర్ -ఆదిలాబాద్

కె. రామకృష్ణ
ఆగస్టు-10
సత్తెమ్మ-రాములు
సంస్థాన్ నారాయణపురం-నల్లగొండ

ఎన్. జశ్వంత్‌కుమార్
3॥సం, 10. 8. 2000
లలిత- నర్సయ్య
షాబాద్-రంగారెడ్డి



రవికిరణ్
1॥సం,11. 8. 2002
రాధ- సత్యనారాయణ
శృంగవరపుకోట- విజయనగరం

బి. పూజిత
1॥సం, 12. 8. 2002
ఇందిర- కాశి
మల్కాపురం-విశాఖపట్నం

ఎ. నవీన్ కుమార్
6సం॥, 13.8.1997
లక్ష్మీదేవి-రమేష్‌బాబు
తలుపుల-అనంతపురం

యల్. శిరీష
8॥సం, 14. 8. 1995
భవాని- బాలకృష్ణ
జమిస్థాన్‌పూర్- హైదరాబాద్

నాలం శ్రీకర్
ఆగస్టు-16
యల్లమ్మదేవి- నాగేశ్వరరావు
మిర్యాలగూడ-నల్లగొండ

కిరణ్‌కుమార్
కమల- దయానంద్
దోమలగూడ- హైదరాబాద్

మనలో మాట

కొడుకు పుట్టాల!

ఆడ అనగా అక్కడనీ-

ఈడ అంటే ఇక్కడనీ అర్థం!

అందువల్ల -

ఆడపిల్లలు - ఎంత కాదనుకున్నా 'ఆడ' పిల్లలే అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతారు!

ఈడ పిల్లలు అయ్యేందుకు రూలు వప్పుకోదు అంటారు!

కొన్నేళ్లు ఈడ పిల్లలుగా పెరుగుతారు! పసిగుడ్డుగా వున్నప్పుడు తమ లేత పాదాలతో తల్లి గుండెల మీద ముగ్గులు వేస్తారు. తండ్రి గుండెల్లో మమత పెంచుతారు!

మనిషిలోని మమకారానికి మరో అర్థం ఆడపిల్ల! మానవత్వానికి ప్రతీక ఆడపిల్ల! సున్నితత్వానికీ, సెంటిమెంటుకి పర్యాయ పదం ఆడపిల్ల!

ఇల్లాంటి ఆడపిల్లని 'ఆడ'పిల్లగా తయారు చేసి, ఆడకు పంపించడం - కన్నవాళ్ళ జీవితంలో - తట్టుకోలేని అధ్యాయంగా మిగిలిపోతుంది!

ఈ నేపథ్యంలో-

ఆడపిల్ల అనవసరమైన దినుసుగా... అక్కర్లేని వరంగా... పెద్ద శాపంగా భావించే సందర్భాలు అనేకం వెలుగులోకి రావడం మామూలైపోయింది!

అదొక ప్రభుత్వ ఆసుపత్రి!

అక్కడ పుట్టిన ఒక మగ శిశువును మార్చి వేసి - ఆ తల్లికి ఆడశిశువును అంటగట్టేరు. అక్రమం జరిగిందని - ఆడశిశువును తన బిడ్డగా అంగీకరించడానికి ఆ తల్లి తిరస్కరించింది!

తనకి పుట్టింది మగబిడ్డేనని, తన బిడ్డను తనకు తెచ్చివ్వాలని పట్టుబట్టింది! అంతవరకు ఆసుపత్రి నుంచి అడుగు బయట పెట్టనని పంతం పట్టింది ఎంతమంది చెప్పినా మొండికేసింది!

ఈ సంఘటన మీద దర్యాప్తు జరిగింది. తల్లి బిడ్డలకు డి.ఎన్.ఎ. పరీక్ష జరిగింది. ఆసుపత్రి వారు ఇచ్చిన ఆడబిడ్డ ఆమె బిడ్డ కాదని తేలింది. మొత్తమ్మీద ఇరవై రెండు రోజుల తర్వాత అసలు బిడ్డకు తల్లికి అప్పగించడం జరిగింది!

ఇంతకీ జరిగిందేమిటంటే -

ఆడపిల్లను కన్నవాళ్ళు మగబిడ్డ కోసం ఎరవేసేరు. ఆస్పత్రి నర్సులు, ఇతర సిబ్బంది వాళ్లకి సహకరించేరు. దాంతో బిడ్డల మార్పిడి. చాలా సులువుగా జరిగిపోయింది!

ఇదీ మగబిడ్డకున్న డిమాండు!

అస్సలు సంతాన యోగం లేకపోయినా సరిపెట్టుకుంటారే గాని ఆడపిల్లపుడితే మాత్రం పుట్టగతులుండవని భయపడతారు! ఇదొక దిక్కుమాలిన పరిస్థితి! ఆర్థిక పరంగా గట్టిగా ముడిపడిన ముదనష్టపు పరిస్థితి! దీన్ని చక్కదిద్దుకోవలసిన బాధ్యత మనందరి మీదా వుంది!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
ఆరోగ్యం	. . . 4
కవర్‌స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
టూరిస్ట్‌గైడ్	. . . 16
క్రీడారంగం	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
కళాసాహితి	. . . 21
పలుకుబడి	24

వగైరా . . . .

ఇంకా...

చిన్నారులలో సహకార భావం

బాలవికాసం . . . **10**



ప్రకృతివరం.. కాల్వబుగ్గ రామేశ్వరం

టూరిస్ట్‌గైడ్ . . . **16**

పాడి

కథ . . . **18, 19**

చదవని ఉత్తరం

రియల్ స్టోరీ . . . **22**


వరల్డ్‌బ్యాంక్ నుండి సార్..! వాళ్ల అప్పు తీర్చేసే!! తప్పకుండా అవుతారట
పుష్కర స్నానం చేసి పునీతుడ్ని అయ్యాను -బాబు


కట్టమంటున్నది రామాలయం కాదట తన గుడేనట..
గుడి కట్టాల్సిందే -జయ ప్రతిపాదన


వాజ్‌పేయిగారి "అయోధ్య స్టేట్‌మెంట్లన్నీ విని...విని.. ఇలా అయిపోయారు డాక్టర్!!
అపునా పెళ్లాంటు ఓహోనా.. గీ పెళ్లాంటు
మానసిక వైద్యశాల డా॥ డమరుకం

కార్టూన్ కదంబం


కొట్టలేదు.. తిట్టలేదు.. సార్!! మా బాస్‌ది "ఒకే బాణం ఒకే మాట" ప్రైసన్నానంతే!

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటేటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేనూ ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ.395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి. ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను V.P.P. ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ.395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

....PIN..........

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

PSKT

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

06/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (•S.R.NAGAR ☎23714330. •MEHDIPATNAM ☎ 55585223. •DILSUKHNAGAR ☎24044352. •KUKATPALLY ☎ 55341431. •VANASTHALI PURAM ☎24122464) •RAJAHMUNDRY ☎2422003. •KHAMMAM ☎227698. •KAKINADA ☎2386638. •VIJAYAWADA ☎ 2630053. •THIRUPATI ☎2252878. •CUDDAPAH ☎224445. •KURNOOL ☎228770. •NELLORE ☎2327702. •GUNTUR ☎2238541. •VISAKHAPATNAM ☎2738892. •NIZAMABAD ☎235767. •BHIMAVARAM ☎229125. •KARIMNAGAR ☎2234883. •WARANGAL ☎ 2578946. •MIRYALGUDA ☎230130. •ANANTAPUR.

* శ్రీధర్‌బాబు బంగారు

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం



ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవం

సృష్టిలో అమ్మకు మించిన దైవం లేదు. అందుకే ఆది నుండి అమ్మ అనే పదానికి అంతగౌరవం సంతరించుకుంది. అలాగే మనిషికి మంచి చేసే వాటన్నింటినీ తల్లితో పోల్చటం సహజం. తల్లి ప్రేమ అలాంటిది మరి! అలాంటి మాతృమూర్తి తన శిశువుకు ఇచ్చే పాలలో కూడా అంతకంటే ఎక్కువ ప్రొటీన్స్, విటమిన్స్ ఉన్నాయంటే ఆశ్చర్యం లేదు. అప్పుడే పుట్టిన శిశువు నుండి రెండేళ్ల వయసున్న పిల్లలకు ఏ సమయంలోనైనా త్వరగా జీర్ణమై, శక్తినిచ్చే పదార్థాలలో తల్లిపాలను మించినవి లేవంటే అతిశయోక్తి లేదు. తల్లి పాలలో ఉన్నన్ని పోషక పదార్థాలు మరే ఇతర పదార్థాలలో శిశువులకు లభించవు. అందుకే ప్రతితల్లీ శిశువు జన్మించినప్పటి నుండి ఏడు నెలల వరకూ తల్లిపాలను ఇవ్వాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గరిష్టంగా రెండు సంవత్సరాల వరకూ శిశువుకు తల్లిపాలను ఇవ్వొచ్చని వారు సిఫారసు చేస్తున్నారు. అయితే పెరిగిన నాగరికత, ఫ్యాషన్‌ల కారణంగా ప్రస్తుతం స్త్రీలు పాలివ్వటం మానేసి ప్రత్యామ్నాయ విధానాలు అనుసరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో మహిళలను చైతన్యవంతం చేసి, తల్లి పాల ప్రాముఖ్యతను తెలిపేందుకుగాను 1992 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకూ మన ప్రభుత్వం 'తల్లిపాల వారోత్సవాలు' నిర్వహిస్తోంది. తల్లిపాల ప్రాధాన్యత, వాటి వలన శిశువులకు కలిగే లాభాలను ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్నారు.

ప్రసవం అయిన తరువాత మొదట వచ్చే పాలను 'కొలస్ట్రమ్' (ముర్రుపాలు) అంటారు. వీటిని పిల్లలకు ఇవ్వకూడదని చాలామంది తల్లులు భ్రమపడుతుంటారు. కానీ అసలు ఈ పాలలోనే ఎక్కువ పోషక విలువలు ఉన్నందున వీటిని తప్పని సరిగా ఇవ్వాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ సూచిస్తోంది. ఈ పాలలో పిల్లల్లోని వ్యాధులను నియంత్రించే ఇమ్యునోగ్లోబులిన్, లాక్టోఫెరిన్, లింపోసైట్స్, ఎంటిస్ట్రెప్టో కోకల్ ఫ్యాక్టర్స్ వంటి ఎన్నో సూక్ష్మజీవ నాశక పదార్థాలుంటాయని వీరి పరిశోధనలలో తేలింది. ఈ పాలు శిశువుకు ప్రాథమికంగా ఇచ్చే టీకాల కంటే ఎక్కువ ఉపయోగపడతాయని వారు సూచిస్తున్నారు. శిశువులకు పాలివ్వటం ద్వారా తల్లుల ఆరోగ్యం కూడా ఎంతో మెరుగుపడుతుందని చాలా మందికి తెలియని విషయం. పాలివ్వటం ద్వారా తల్లి ప్రజనన శక్తి(రుతుక్రమం) అదుపు కావటం వలన కాన్పుల మధ్య ఎడాన్ని పొడిగిస్తుంది. ప్రసవం అయిన వారి గర్భకోశం తొందరగా మామూలు స్థితికి వస్తుంది. పిల్లలకు పాలిచ్చే తల్లుల్లో 80 శాతం మందికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు అంటున్నారు. అలాగే శిశువులకు కూడా తల్లిపాల వలన అనేక లాభాలున్నాయి. శిశువు బాగా పెరగటానికి, ఆరోగ్యంగా ఉండటానికి తల్లిపాలు ప్రకృతి సిద్ధమైన ఉత్తమ ఆహారం. ఈ పాల వలన పిల్లలకు అంటువ్యాధుల నుండి రక్షణ లభిస్తుందనీ, తల్లి శిశువులకు పాలివ్వటం వలన తల్లీబిడ్డలు శారీరకంగా, మానసికంగా బాగా దగ్గరవుతారనీ, పాలిచ్చే తల్లులు చక్కటి ఆరోగ్యంతో ఉంటారని జాతీయ పోషకాహార సంస్థ జరిపిన పరిశోధనల్లో తేలింది. ప్రస్తుతం శిశువులకు తల్లిపాలివ్వటం మోటయిపోవటంతో డబ్బాపాలు, గేదెపాలను ఇస్తున్నారు. దీంతో శిశువులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వీరు ధృవీకరించారు. ఈ పాలలో శిశువులకు హానికరమైన చక్కెరలు ఎక్కువగా ఉండటంతో వయసుకు మించిన బరువు అవటం ద్వారా శ్వాసకోశ, గుండె జబ్బులబారిన పడుతున్నట్లు వైద్యుల పరిశీలనలో తేలింది. ఇటువంటి సమస్యలు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో శిశువులలోనే వస్తున్నట్లు కూడా వీరు తెలియజేస్తున్నారు. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు తమ శిశువులకు పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల వరకూ తల్లిపాలనిస్తున్నారు. దాంతో ఈ ప్రాంతాల్లోని శిశువులు ఆరోగ్య పరంగాకూడా పట్టణ ప్రాంతాల్లోని శిశువులకంటే ఎక్కువ శక్తి కలిగి ఉన్నట్లు తేలింది. పట్టణ ప్రాంతాల్లో తల్లీ బిడ్డల మధ్య ఆప్యాయతలలో వస్తున్న వ్యత్యాసాన్ని గురించి కొన్ని శిశుపరిశోధనా సంస్థలు ఇటువంటి పరిస్థితిని వారించేందుకు అనేక 'తల్లిపాల సేకరణ కేంద్రాలను' ఏర్పాటు చేస్తున్నారు. మన దేశంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపేందుకుగాను 'బ్రెస్ట్ ఫర్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఇండియా', ముంబైలో 'ముంబై బ్రెస్ట్ ఫర్ ప్రమోషన్ నెట్‌వర్క్' సంస్థలు తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నాయి. అలాగే నియోటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ట్రాన్సిషనల్ కేర్ యూనిట్, ప్రీ మెచ్యూర్ యూనిట్ వంటి సంస్థలు తల్లిపాలను సేకరించి శిశువులకు అందిస్తున్నాయి.

తల్లిపాలు సరిపోకపోతే ఏంచేయాలి

తల్లిపాలు చాలకపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను జాతీయ పోషకాహార సంస్థ కింది సూచనలు చేసింది.

తల్లిపాలు సరిపోని శిశువులకు ఆవు పాలను మాత్రమే ఇవ్వాలి. ఇటువంటి పాలను బాగా మరిగించి, పాలకు సమాన మోతాదులో నీళ్లను కలిపి పట్టించాలి. ఆరు వారాలు వచ్చే వరకూ ఇటువంటి పాలను మాత్రమే ఇవ్వాలి. తరువాత చిక్కటి పాలను ఇవ్వవచ్చు. ఇటువంటి పాలను పిల్లలకు ఎక్కువ మోతాదులో ఇవ్వకూడదు. ప్రతిరోజూ 120-180 మిల్లీలీటర్ల పాలలో ఒక టీ స్పూను చక్కెర కలిపి రోజుకు 6 నుండి 8 సార్లు ఇవ్వవచ్చు. డబ్బాపాలు ఇవ్వాలనుకుంటే కంపెనీ వారు సూచించిన నిబంధనలను తప్పకుండా పాటించాలి.

ఇంతటి విలువైన పాలను తల్లులు ఇకనుండైనా శిశువులకు ఇస్తూ వారి ఆరోగ్యంతోపాటు తమ ఆరోగ్యం కూడా కాపాడుకుంటారని ఆశిద్దాం. ●



నాకు నెత్తి నొప్పి ప్రతిరోజూ ఎక్కువగా వస్తుంటుంది. ఎందువలన అనగా ఏకాగ్రత పెట్టి చదవడం వల్ల కాని, రాయటం వల్ల కాని నెత్తి బాగా నొప్పుంటుంది. కావున నెత్తినొప్పి గూర్చి క్లుప్తంగా వివరించి దీనిని నివారించటానికి ఏం చేస్తే తక్కువవుతుంది. సలహా ఇవ్వగలరు.

– రామ్‌లాల్, కల్లాపూర్

చదవటం వల్ల, రాయడం వల్ల ప్రతిరోజూ వచ్చే తలనొప్పి దృష్టి లోపం వల్ల కావచ్చు. కళ్ళు పరీక్ష చేయించుకొని కళ్లజోడు వాడితే మీ సమస్య తప్పకుండా తీరుతుంది. వెంటనే కళ్ళ డాక్టర్ని సంప్రదించండి

డాక్టర్ జి.ఎస్.కె.శేఖర్,
జనవిజ్ఞాన వేదిక, సబ్‌కమిటీ మెంబర్, హైదరాబాద్

* గమిడి శ్రీనివాస్



అనంత సేవలో ఆకాశవాణి

"రేడియో ఒక అద్భుతమైన శక్తి. దైవం యొక్క అద్భుత శక్తిని అందులో చూశాను"

అని జాతిపిత మహాత్మాగాంధీ అన్న మాటలు ఇప్పటికీ నిలిచియున్న నిజాలు! మన దేశంలో రేడియో ప్రసారాలు ప్రారంభమయి 80 సంవత్సరాలు గడిచాయి. మానవ జీవనశైలిలో...ప్రసార మాధ్యమాల్లో...ఎంతో అభివృద్ధి...ఎన్నో మార్పులు. అయినా ఇప్పటికీ ఆకాశవాణి అందరికీ ప్రియమైనదే. ఆధునిక జీవితాన్ని టెలివిజన్ ముంచెత్తినా రేడియో వినకుండా రోజుగడవని కుటుంబాలు దాదాపు 11 కోట్లు ఉన్నాయి. దేశంలో మొత్తం 19 కోట్ల కుటుంబాలు ఉండగా టెలివిజన్ కల్గి ఉన్న కుటుంబాలు ఆరు కోట్లు మాత్రమే. సామాన్యుని మొదలు దేశ ప్రథమ పౌరుని వరకు అందరూ ఆకాశవాణికి శ్రోతలే. దేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ నిర్మాణంలో ఆకాశవాణికి హర్షించదగిన పాత్ర ఉంది. వినోదంతో పాటు విజ్ఞానాన్ని, విషయాన్ని ఆరోగ్యకర పద్ధతుల్లో అందిస్తున్న ఆకాశవాణికి ఆదరణ పెరుగుతున్నది. ఉదయం 5:55 గంటలకు సుప్రభాతంతో ప్రారంభమయి రాత్రి 11 గంటల వరకు ఆకాశవాణి పాడుతూనో, పలకిరిస్తూనో, చర్చిస్తూనో, సలహాలు ఇస్తూనో ఉంటుంది. కొన్ని ప్రసార మాధ్యలకు భయపడి పిల్లలను దూరంగా ఉంచుతున్న తల్లితండ్రులు రేడియోకు దగ్గరవుతున్నారు. 'బహుజన హితయ..బహుజన సుఖయ'నే లక్ష్యంగా పనిచేస్తున్న రేడియో ఏ ఇతర ప్రసార మాధ్యం కూడా చేయలేని ప్రజా సేవ చేస్తున్నది. అన్ని వర్గాల ప్రజలకు కావలసిన కార్యక్రమాలను అందిస్తున్నది. వాతావరణ వివరాలు మొదలు కొని ఉద్యోగ, విద్యార్థి, కార్మిక, వ్యవసాయ, మహిళా రంగాలకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలను అందిస్తున్నది. డాక్టర్ సలహాలు, ప్రముఖులతో ఇంటర్వ్యూలకు పెద్ద ఎత్తున స్పందన ఉంది. రేడియో కార్యక్రమాల్లో సినిమా కార్యక్రమాలకు మంచి స్పందన ఉన్నప్పటికీ వివిధ అంశాలపై చర్చ కార్యక్రమాలకు కూడా ప్రజల నుండి డిమాండ్ పెరుగుతున్నది. సమాజంలోని అన్ని రంగాల, వర్గాల ప్రజల అవసరాలను, ఆకాంక్షలను తీర్చుతున్న ప్రసారమాధ్యమాలలో ఆకాశవాణిదే అగ్రస్థానం అనడంలో అతిశయోక్తి లేదు. ప్రకృతి వైపరీత్యాల కాలంలో ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వాణి, వారధి ఆకాశవాణి మాత్రమే. అంతటా వ్యాపించిఉన్న ఆకాశవాణి అశేష జనానికి అనంత సేవలను అందిస్తున్నది.

పెరుగుతున్న ఆదరణ

హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ దుర్గాభాస్కర్



ప్రసార మాధ్యమాల్లో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ, టీవీల సంఖ్య పెరిగినప్పటికీ ఆకాశవాణికి ఆదరణ ఇంకా పెరుగుతున్నదని హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ శ్రీమతి దుర్గాభాస్కర్ తెలిపారు. ఆకాశవాణికి వినోదం కన్నా విజ్ఞానాన్ని పెంచడం, సమాచారాన్ని అందించడం ముఖ్యమని చెప్పారు. ప్రజా సేవ దృష్టిలో ప్రసార కార్యక్రమాలను నిర్మిస్తున్న సంస్థ అకాశవాణి తప్ప మరేదీ లేదన్నారు. ఒక్కో కార్యక్రమానికి 100 ఉత్తరాల పైన వస్తున్నాయని, తరగని ఆదరణకు ఇదే నిదర్శనమని అన్నారు. సినీ పాటలైనా తగ్గించి ప్రముఖులతో చర్చ కార్యక్రమాన్ని పెంచమని వీక్షకుల నుండి డిమాండ్ వస్తున్నదని, ఇదో ముఖ్యమైన మార్పని చెప్పారు. యువకులు సైతం ఆకాశవాణిని ఎక్కువగా ఆదరిస్తున్నారని, యువకుల కోసం యువవాణి కార్యక్రమాన్ని యువకులే నిర్వహిస్తున్నారని, యువకులే పాల్గొంటున్నారని చెప్పారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొంటున్నారని చెప్పారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా తమ కార్యక్రమాల్లోనూ మార్పు తెస్తున్నట్లు చెప్పారు. ఫోన్ ద్వారా డాక్టర్ సలహాలు పొందే కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తున్నదని చెప్పారు. స్వచ్ఛమైన భాషను రక్షించడంలోనూ తాము ఎనలేని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన వినోదాన్ని ఆకాశవాణి మాత్రమే అందిస్తున్నదన్నారు. ఆకాశవాణి వార్తలు పక్షపాతంలేని వాస్తవాలతో కూడిన వార్తలని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ప్రతి శుక్రవారం జాతిపిత గాంధీజీని స్మరిస్తున్నది ఆకాశవాణి మాత్రమేనన్నారు. సంస్కృతిని రక్షించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నామని, పాతను ఆదరిస్తూనే ఆరోగ్యకర రీతిలో కొత్తను ఆహ్వానిస్తామని చెప్పారు. 1967లో ఆల్ ఇండియా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా హైదరాబాద్ కేంద్రంలో ఉద్యోగిగా చేరిన దుర్గా భాస్కర్ తరువాత యుపిఎస్‌సి ద్వారా ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యారు. తరువాత అహ్మదాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖ కేంద్రాల్లో పని చేశారు. పరిపాలకురాలిగానే కాక ప్రోగ్రామ్‌లు కూడా నిర్వహించారు. కవితలు, నాటకాలు, పాటలు చాలా రాశారు. వీటికి గాను ఆకాశవాణి 1993, 1994లో పురస్కారాలు ప్రకటించింది. ఆంధ్రభాషకు చేసిన సేవకు గాను రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పురస్కారాన్ని ప్రకటించింది. అహ్మదాబాద్ కేంద్రంలో తొలి దక్షిణ భారత మహిళా డైరెక్టర్‌గా, విజయవాడలో తొలి మహిళా డైరెక్టర్‌గా, హైదరాబాద్‌లో తొలి తెలుగు మహిళా డైరెక్టర్‌గా దుర్గాభాస్కర్ గుర్తింపును పొందారు.

వార్తలు..వార్తలు...వార్తలేవార్తలు

ఆకాశవాణి

సమయం ఉదయం ఆరు గంటల 45 నిమిషాలు

వార్తలు చదువుతున్నది కొవ్వుల సుబ్బారావు

ఇలా ప్రారంభమయిన వార్తలు ఆగకుండా వినిపిస్తూనే ఉంటాయి. స్టేషన్లు మార్చుకునే ఓపిక వీక్షకునికి ఉంటే రోజంతా వార్తలు వినవచ్చు. చంకలో రేడియోను పెట్టుకుంటే సాయంత్రానికి ప్రపంచమంతా చుట్టిరావచ్చు. ప్రాంతీయ వార్తలు, జాతీయ వార్తలు, ఇంగ్లీష్‌లో వార్తలు, ఉర్దూలో వార్తలు, హిందీలో వార్తలు, క్రీడా వార్తలు, విదేశీ వార్తలు ఇలా ఒక్క రోజులో వివిధ స్టేషన్ల ద్వారా దాదాపు 32 సార్లు ఆకాశవాణి వార్తలు వినిపిస్తుంది. రేడియో వార్తలు వినకుంటే నిద్దర పట్టని వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పోటీ పరీక్షలకు తయారయ్యేవారు రేడియో వార్తలను ప్రధాన సమాచారంగా ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా ఫోన్ల ద్వారా వార్తలు చెప్పే కార్యక్రమాన్ని కూడా ఆకాశవాణి కల్పించింది. ఎవరైనా ఏ క్షణమైనా ఆనాటి వార్తలు కావాలని భావిస్తే హైదరాబాద్ కేంద్రానికి 23244343 నెంబర్‌కు ఫోన్‌చేస్తే వార్తలు తెలుసుకోవచ్చు. ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ ఉంది. రోజుకు దాదాపు వెయ్యికిపైగా ఫోన్లు హైదరాబాద్ కేంద్రానికి వస్తున్నాయి.

గ్రామీణుల నేస్తం

అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ రేడియో గ్రామీణుల నేస్తమే. గ్రామీణులకు, సామాన్యులకు అవసరమైన ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నది. వ్యవసాయదారుల కోసం రోజుకు ఒక గంట 10 నిమిషాల పాటు వ్యవసాయ కార్యక్రమాలను అందిస్తున్నది. దేశంలో హరితవిప్లవ సాధనలో రేడియోకు అధిక ప్రాధాన్యత ఉంది. పొలం పనులు, పాడి పంటలు, ఇల్లు వాకిలి లాంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయదారులకు ఎదురయ్యే సమస్యలకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తుంది.

ఏ ప్రాంతానికి సంబంధించిన పంటలపై ఆ ప్రాంత శాస్త్రవేత్తతో సూచనలు అందిస్తుంది. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఫీల్డ్‌సర్వే ద్వారా గ్రహించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తుంది. వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను నాటకాలు, రూపకాలు, చర్చల ద్వారా రైతులకు తెలుపుతుంది. స్థానిక రేడియో కేంద్రాలు వచ్చిన తరువాత వ్యవసాయదారులకు రేడియో మరింత చేరువవుతున్నది. ఒక కార్యక్రమంపై అభిప్రాయం తెలిపేందుకు రెండు రోజుల ప్రకటనకే వెయ్యి

ఉత్తరాలు హైదరాబాద్ కేంద్రానికి అందుతున్నాయి. రైతుల నుండి ఎప్పుడూ ఫోన్లు వస్తూనే ఉంటాయి. పంటలకు, పశువులకు రాష్ట్రంలో ఏ మూల ఏ సమస్య వచ్చినా వెంటనే దానిపై రైతులందరినీ హెచ్చరిస్తుంది. ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి, వ్యవసాయదారులకు మధ్య వారధిలా పనిచేస్తున్నది. వినోద కార్యక్రమాలకైనా గ్రామీణ ప్రాంతాల నుండే అధికంగా ఉత్తరాలు రావడం గమనార్హం.

అమ్మ ఒడి ఆకాశవాణి

ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి అన్న మాటలవి. ఆయనతోపాటు ఎందరో కవులు, రచయితల ఎదుగుదలకు ఆకాశవాణి ఆసరా అయింది. యువ రచయితలు, కవులు, వ్యాఖ్యాతలను ప్రముఖులుగా తీర్చిదిద్దింది. తన ఎదుగుదలకు ఆకాశవాణే కారణమని ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షాభోగ్లే పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, కళలను రక్షిస్తున్నది. సంప్రదాయ సంగీతంతో పాటు జానపద కళలు, గిరిజన కళలను ప్రోత్సహిస్తున్నది. ఈ కళలకు సంబంధించిన గత కాలపు వైభవాలను భద్రపరుస్తున్నది. కర్నాటక, హిందుస్థానీ సంగీతాలను సజీవంగా నిలపడంలో ఆకాశవాణి పాత్ర కీలకం. స్వచ్ఛమైన భాషకు చిరునామా ఆకాశవాణి. స్వాతంత్యదినోత్సవం సందర్భంగా జాతీయ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నది. వివిధ భాషల్లోని ఉత్తమ కవితలను దేశవ్యాప్తంగా ప్రజలను ఆస్వాదింపజేస్తుంది. తద్వారా జాతీయ సమైక్యతను పెంపొందిస్తున్నది. ఎంతోమంది కళాకారులకు జీవనోపాధిని కల్పిస్తున్నది. గాయకులకు, రచయితలకు, వ్యాఖ్యాతలకు ఆకాశవాణి ఇచ్చే గ్రేడింగ్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ఆకాశవాణి మొదటి గ్రేడింగ్‌లో ఉన్న సంగీత కళాకారులకు విదేశాల్లో కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

ప్రయివేట్ పడగ

వినోదంతో పాటు విశేష విజ్ఞానాన్ని అందిస్తున్న రేడియో కూడా ప్రయివేట్ పడగ క్రిందకు నెమ్మది నెమ్మదిగా చేరుతున్నది. సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రసార భారతి ఏర్పాటు చేసిన తరువాత నిధులను స్వంతంగా సమకూర్చుకోవాలని ఆకాశవాణికి ఆదేశాలు అందాయి. దీంతో ఆకాశవాణిలో కొంత సమయాన్ని ప్రయివేట్ వారికి అమ్మేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రం పరిధిలో జబాఫోర్ అనే రేడియోకు రోజుకు రెండు గంటల సమయాన్ని అమ్మేశారు. వినోద ప్రాముఖ్యం కల్గిన కార్యక్రమాలను విస్తృతంగా అందిస్తున్న జబాఫోర్ రేడియోకు విపరీత ఆదరణ పెరుగుతున్నది. ఆకాశవాణి నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూనే జబాఫోర్ రేడియో ప్రత్యేక గుర్తింపును పొందింది. రేడియో టెక్నాలజీలో కొత్త ఒరవడిగా ఎఫ్ఎమ్ స్టేషన్లు వచ్చాయి. వీటి ద్వారా స్థానికంగా ప్రజలకు రేడియో మరింత దగ్గరయింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఎం కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రయివేట్ సంస్థలకు అనుమతులిస్తున్నది. ఇప్పటికే విశాఖలో సూర్య ఛానల్ వారు ఈవిధమైన ఎఫ్ఎం కేంద్రాన్ని నడుపుతున్నారు. అలాగే ముంబాయి, ఢిల్లీ, కలకత్తాలలో కూడా ప్రయివేట్ ఎఫ్ఎం రేడియో కేంద్రాలు ఉన్నాయి. వీటికి ప్రజా సేవతో సంబంధం లేదు. వినోద కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చే ఆదాయాలకే ప్రాముఖ్యత. ఈ పరిమాణాలు ప్రస్తుతం ఆకాశవాణిపై పెద్దగా ప్రభావం చూపకున్నా రానున్న కాలంలో ప్రమాదంగా మారే అవకాశముంది. ●

రేడియో సెట్లు కలిగిన కుటుంబాల శాతం

కేంద్రం	గ్రామీణం	పట్టణం	మొత్తం
ఢిల్లీ	60	71	65
లక్నో	58	.62	60
ఇండోర్	72	66	69
అలహాబాద్	63	41	52
జోద్‌పూర్	66	76	71
హైదరాబాద్	26	40	33
విశాఖపట్టణం	54	53	54
విజయవాడ	40	42	41
చెన్నయ్	41	72	57
తిరువనంతపురం	75	81	78
దార్వాడ్	63	71	67
బెంగుళూరు	38	70	54
పూణె	61	54	58
నాగపూర్	54	63	59
అహ్మదాబాద్	33	49	40
కోల్‌కత్తా	59	61	60
రాంచీ	46	51	49
పాట్నా	66	56	61
గౌహతి	65	54	59
దేశ సగటు	54	60	57

ఆంధ్రప్రదేశ్‌లో ఆకాశవాణి కేంద్రాలు

ముఖ్య కేంద్రాలు

హైదరాబాద్	విజయవాడ
విశాఖ	కడప

ప్రాంతీయ కేంద్రాలు

ఆదిలాబాద్	నిజామాబాద్
కొత్తగూడెం	కర్నూల్
మార్కాపురం	అనంతపురం
తిరుపతి	వరంగల్

ఉత్తమ పది కార్యక్రమాలు

6:00: ప్రభాతగీతం
6:10: భక్తి రంజనీ
6:30: భావన
7:10: ప్రధాని సందేశం
7:22: ఉదయ తరంగిణి
9:00: చిత్రసీమ
13:20: పాడిపంటలు
19:00: ఉద్యోగ వార్తలు
19:25: ఇల్లు-వాకిలి
20:15: స్త్రీశక్తి

భారత రేడియోకు 80 ఏళ్లు



భారతదేశంలో మొదటి రేడియో కార్యక్రమాన్ని 1923 జూన్‌లో బాంబే రేడియో క్లబ్ ప్రసారం చేసింది. 1927 జులైలో ప్రయోగాత్మకంగా బొంబాయి, కలకత్తాలలో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసును ఏర్పాటు చేశారు. ఆ సర్వీసుకు భారత ప్రభుత్వం, ప్రయివేట్ కంపెనీ మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్‌గా పిలిచారు. హైదరాబాద్‌లో మొదటిగా 1933లో ప్రయివేట్ రేడియో స్టేషన్ ఏర్పాటు చేశారు. 1935లో దాన్ని నిజాం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 1939లో దక్కన్ రేడియోగా పేరు మార్చారు. 1950 నుండి ఆ కేంద్రాన్ని భారత ప్రభుత్వం ఆల్ ఇండియా రేడియో పరిధిలోకి తీసుకువచ్చింది. స్వాంతంత్ర్యం వచ్చేనాటికి ఆల్ ఇండియా రేడియో కింద ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లిలో మాత్రమే కేంద్రాలు ఉన్నాయి. వీక్షకులు పట్టణప్రాంతాలకే పరిమితమై ఉండేవారు. స్వాతంత్ర్యం నాటికి దేశవ్యాప్తంగా రెండు లక్షల 75 వేల రేడియో సెట్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 11 కోట్ల 10 లక్షల రేడియో సెట్లు ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 210 ప్రసార కేంద్రాలు ఉన్నాయి. అందులో 77 రేడియో కేంద్రాలు ఉన్నాయి. దేశంలోని 100 శాతం జనాభా రేడియో నెట్‌వర్క్ పరిధిలో ఉంది.

✻ ముదిగంటి సుజాతారెడ్డి

క్రికెట్ ఒక్కటే ఆటా?



మాలిని మా పక్కింటావిడ. కొడుక్కు సెలవేమో వాడ్ని వెంట బెట్టుకొని వచ్చింది.

"ఇదో! వీడికి క్రికెట్ బ్యాట్, బంతి కావాలంటే కొందామని బజారుకెళ్ళాను. ఇంట్లోకెళ్తే మళ్ళీ బయటికి వచ్చే మూడ్ వుండదని ఇదిగో బజారు నుంచి సరాసరి మీ ఇంటికి వచ్చాను" అంది మాలిని.

"సరే! మంచిపని చేశావు. ఈ మధ్య బొత్తిగా కన్పిస్తలేవు."

"వీడికి స్కూలు మొదలైంది కద! తీరికే లేదు. పొద్దున్న వీడ్ని స్కూలుకు పంపించే హడావిడి తర్వాత మా ఆయన తొందర! వాళ్ళను పంపించి ఆ పని ఈ పని చేసుకున్నానో లేదో వీడు స్కూలు నుంచి వచ్చే టైమ్ అవుతుంది!... దాంతో తీరికే దొరకడం లేదు."

"ఊఁ బ్యాట్ బంతితో పాటు క్యాప్ కూడా కొన్నావు! బాబ్జీ! క్రికెట్ ఆడుతావా?" అడిగాన్నేను వాడ్ని. బాబ్జీకి నాలుగేళ్ళయినా లేవు. యూకేజి చదువుతున్నాడు. నా మాట విని వాడి ముఖం బల్బులా వెలిగిపోయింది.

"ఓ! ఆంటీ! నేను క్రికెట్ ఆటలో టెండూల్కర్‌లా బ్యాటింగ్ చేస్తా. కపిల్‌దేవ్‌లా బౌలింగ్ చేస్తా!" అన్నాడు. వాడి క్రికెట్ పరిజ్ఞానానికి నాకాశ్చర్యమేసింది. వేలెడంత లేదు!... అప్పుడే! ఆటగాళ్ళను ఆరాధించడం. వాళ్ళలా అవుతానని ధీమాతో చెప్పడం చూసి నాకు చాలా ఆనందం కలిగింది. వాడి బుగ్గలు తాకాను ప్రేమగా. సిగ్గుతో వాడి బుగ్గలు ఎర్రబడ్డాయి. అది చూసి మాలిని నేనూ నవ్వాం.

"ఆఁ... ఎప్పుడూ క్రికెట్ ముచ్చట్లే వీడికి..." అంది మాలిని కొంచెం విసుగు ప్రదర్శిస్తూ. "ఇరవై నాలుగ్గంటలూ టీవీలో క్రికెట్ ఆట చూపిస్తున్నారు. పిల్లలు అది చూసి ఆ ఆట మీద ఆసక్తిని పెంచుకుంటున్నారు. మీడియా... అంటే టీవీలు పత్రికల ప్రకటనలు అన్నీ క్రికెట్‌ను పైకెత్తేస్తున్నాయి. ఆటగాళ్ళకు బోలెడు డబ్బు సంపాదించే అవకాశాలు. దాంతో క్రికెట్ ఆటగాళ్ళు పిల్లలకు ఆరాధ్యులుగా మారారు! అందులో ఏం తప్పువుంది మాలినీ!" అడిగాన్నేను. "అదికాదు సుశీ! ఎప్పుడూ టెండూల్కర్, కపిల్‌దేవ్... అంటారు. కాని ఒక్కసారైనా నేను ధనరాజ్ పిళ్ళై అవుతాను అంటారా!... పిల్లలు!" అంది మాలిని. "ధనరాజ్ పిళ్ళై? ఎవరతను?" - బొమలు ముడివేసి ప్రశ్నించాన్నేను.

"అయ్యో! అదే గద నేను మొత్తుకునేది. ధనరాజ్ పిళ్ళై మన హాకీ కెప్టెన్! మన నేషనల్ గేమ్ అంటే జాతీయ క్రీడ హాకీ. మన హాకీ టీమ్ ఒలింపిక్స్‌లో. ఆడి ఎన్నో గోల్డ్ మెడల్ళను సంపాదించింది. మన హాకీ ఆటగాళ్ళ ఆట నైపుణ్యం చూసి ప్రపంచంలో అందరూ ఆశ్చర్యపోయేవాళ్ళట! 1936లో బెర్లిన్‌లో జరిగిన ఒలింపిక్ ఆటల్లో భారత్ జట్టులోని ధ్యాన్‌చంద్ హాకీస్టిక్‌తో బాల్‌ను తిప్పుతుంటే ఏంటిది! హాకీ స్టిక్‌కు ఏమైనా అయస్కాంతం వుందా అని హిట్లర్ ఆశ్చర్యపోయాడట. ధ్యాన్‌చంద్, ధనరాజ్ పిళ్ళైల గురించి మనకూ మన పిల్లలకూ ఏం తెలియదు మాలిని ఆవేశంగా చెబుతున్నది.

"నిజమేనే ఎప్పుడో నేనూ విన్నాను. కాని మరచిపోయానంతే..." అన్నాన్నేను.

"సుశీ! నీకు తెలుసా.. 1932, 36, 48, 52, 56 సంవత్సరాల్లో జరిగిన ఒలిపింక్స్‌లో భారత్ హాకీజట్టు వరుసగా స్వర్ణపతకాలు సాధించింది. మళ్ళీ 1984లో కూడా స్వర్ణపతకం సంపాదించింది. అటువంటి ఆటను ప్రభుత్వంగాని స్పాన్సర్లుగాని, ప్రేక్షకులు గాని నిరాదరిస్తున్నారు. దాంతో హాకీ ఆటగాళ్ళు నిరుత్సాహపడుతున్నారనుకో!" అంది మాలిని. మాలినికి కాలేజీ కాలం నుంచీ కూడా ఆటలంటే అభిరుచి ఎక్కువ. అందుకే దానికిన్ని విషయాలు తెలుసు. నా ముఖంవైపు చూస్తూ మళ్ళా అందుకుంది మాలిని. "సుశీ! ఈ మధ్య ఆస్ట్రేలియాలో, జర్మనీలో జరిగిన హాకీ టోర్నమెంట్లల్లో మన భారత జట్టు గెలిచి మొదటి స్థానంలో నిలిచిందంటే మనం ఎంతగానో గర్వించాలి. జర్మనీలో మంచి ఆటగాళ్ళయిన అర్జెంటీనా, స్పెయిన్ హాకీ జట్లను మన జట్టు ఓడించింది... పానాసోనిక్ కప్పును గెలుచుకొని తెచ్చింది. ఇన్ని విజయాల్ని సాధించినా వాళ్ళకు క్రికెట్ జట్టుకు ఇచ్చేంత ఘనమైన స్వాగతం గాని, ప్రత్యేకమైన ఆదరణ గాని పొగడ్తలుగాని ఏదీ దొరికినట్లు కన్పించదు.!" మాలిని ముఖం చిన్నబోయింది.

"అవునే మాలినీ! ఆటంటే ఒక్క క్రికెట్టే అనుకుంటాం. దాన్ని గురించే మాట్లాడ్తాం. చర్చించుకుంటాం. టీవీకి కళ్ళప్పగించి చూస్తుంటాం. కాని ఆటలు అంటే ఇంకా వేరే ఆటలున్నాయి. క్రికెట్‌లో కన్నా మిగతా ఎన్నో ఆటల్లో భారతీయులు బాగా ఆడి అంతర్జాతీయ మెడల్స్ షీల్డ్‌లు గెల్చుకుంటున్నారు. మొన్ననే చూడు మన అమ్మాయి సానియా మీర్జా వింబుల్డన్ ప్రపంచ కప్పును గెల్చుకొని అందర్నీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసింది. వాళ్ళనెవర్నీ గమనించడంగాని, వాళ్ళ విజయాలను గుర్తించి మాట్లాడుకోవడం గాని మనం చేయడం లేదు. చాలా పెద్ద నేరమే మనం చేస్తున్నాం!" అన్నాన్నేను. సానుభూతిని చూసి మాలిని ఎంతో సంబరపడింది. ●

గోస

కొడుకా... నా కొంగు బంగారమా
భూఁవికీ ఆకాశంకి మద్దిన గెడ గర్రమీద
ఎన్ని యిద్దిలు సేసినా ఏటినాబం?
సేతల నాలుగు పైసలు రాలని ఈటీ వోడి సందియమే!
నేలబుగ్గి నెత్తికెత్తుకోని పంటకలగన్న పాపానికి
నీ యింటిల కరువు పామై మటమేసింది గదరా నాయినా!

నా తొలిసూలు కొడుకా... తొలకరి సినుకా
మూడు కాలాలు ముచ్చుదేవతల్లాగ
కళ్లల్ల నిప్పులు పోసుకోని నీ మీద పగటబట్టినప్పుడు
బువ్వ తినిపించిన బూదేవత గుండె బీటలుదేలి పోయిందిరా నాయినా...

నా ఎండికొండా... సల్లంది కుండా...
మూటాముల్లె సర్ది నువ్వు ముంజోరు దాటుతుంటే
మూగ దెయినాగ నాగలి మూలసేరిపోయిందిరా
అవమానం తోటి కొడవలి అట్టుగెక్కిపోయిందిరా నాయినా..

నా కంటి దీపమా.. నా ఇంటి ఎల్తురా...
గతించిపోయిన గరిక పచ్చటి రోజుల్ని నెమరేసుకోని
గడ్డిపరకల్ని కలగంటున్న పశువుల్ని...
ఇనపగెద్దలు సాలముందల వాలి
కబేలాకి రమ్మని కబుర్లు పెడతన్నాయిరా కన్నా.

నరతోట నాలికి మీద నాలుగు మెతుకులవ్వడానికి
తెచ్చిన అప్పులకి తెగ్గోసి యివ్వడానికి నువ్వు సిబి సెక్రవర్తివే గానీ..
నీ వొంటిల ఎముకలు తప్ప ఏటి మిగల్నాయిరా కొడుకా...

తెల్లారక మునుపు సీకటి ముసుగేసి
ముకం సాటు సేసుకోని ఊరుదాటి ఎలిపోతుంటే..
ఊరు ఊరంతా కన్నీటి ఏరయ్యిందిరా కన్న తండ్రీ...

నీ మట్టి కాళ్లను సుట్టుకోని
నువ్వు మళ్ల సల్లగ తిరిగి రావాలని...
నాగావళి తల్లి గుంపసోమన్న తండ్రిని కోరతందిరా కొడుకా...

నాదరమరాజా...
దగాతెలీనోడా!....

- చింతా అప్పల నాయుడు

కాలం గాయమై తట్టింది

'నిజంగా వాన
మబ్బు చాటున అలిగింది
నిబ్బరం లేని గుండె భూమి ఎండిపోయింది
తడారిన హృదయాల్లో
పగుళ్ల లోయల్లోంచి
మట్టి మనిషి
రైతు విరబూయడం లేదు
చుక్కలు పూసినంతగా
కలలు రాలినంతగా
చినుకులు ఎగరటం లేదు
బహుశా కన్నెర్ర జేసిన సూరీడికి
మబ్బులు మద్దతు తెలపడమేమో!
ఎరుపెక్కిన కొండల్లో
ఉడికిన జీవకారుణ్యాలు
ఈవేళ ఆవిరైపోతున్న
కప్పల బెకబెకల వైవిధ్యం
వలస పక్షుల సంగీతం
కరువు సంతకమై నిలుస్తుంది
అవునా
ఆకలి తుపాను వీయడం
వలస గొడుగుల్ని వాటేస్తుంది కదూ!"

- గవిడి శ్రీనివాస్

✻ వి.ఆర్.వాగోలు

చిన్నారులలో సహకార భావం

'అరే గోపీ రాయమంటే రాయకుండా ఖాళీగా కూర్చున్నావేమిటిరా?' అని అడగటంతో భయంగా 'బలపం లేదండీ' అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. 'మేస్టారండీ నేనిత్తానండీ' అంటూ ఇద్దరు ముగ్గురు బాలబాలికలు గోపీకి బలపం ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. 'సరితా పుస్తకం చూసి చదువు అంటే దిక్కులు చూస్తున్నావేమిటి?" అని ప్రశ్నించడంతో 'ఈ రోజు పుస్తకం తీసుకురావటం మర్చిపోయానండి' అని సమాధానమిచ్చింది. దాంతో 'మా పుస్తకంలో చూసుకుందువుగాని రా అంటూ సరిత మిత్రురాళ్ళు కొంతమంది పుస్తకం చూపించేందుకు ముందుకు వచ్చారు. 'ఏరా కళ్యాణ్ నీవొక్కడివే మిగిలిపోయావు ? నిన్నెవరూ ఆటలో పెట్టుకోలేదా 'అనటంతో' లేదండీ నన్నెవరూ ఆటలో పెట్టుకోలేదండీ' అన్నాడు. అలా అనడంతో ఒకజట్టు సభ్యులు మేము పెట్టుకుంటామండీ' అంటూ ముందుకు వచ్చారు.

ఇటువంటి సంఘటనలు నిత్యం మనం తరగతి గదిలోనో లేక సమాజంలోనో సాధారణంగా చూస్తూనే ఉంటాం. వీటిని పరిశీలిస్తే ఒక విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. అది చిన్ననాటి నుండే బాలబాలికలలో సహకార భావం ఉంటుందనే విషయం. తల్లిదండ్రులు తమ చిన్నారుల గురించి ఇతరులతో చెప్పేటప్పుడు మా బాబు ఒట్టి మొండివాడు. ఇతరులకు కొద్దిగానైనా సహాయం చెయ్యడు అనటం, మా పాప అన్నీ తనకే కావాలని పేచీ పెడుతుంది. వీరితో ఎలాగో అర్థం కావట్లేదు అని వాపోతూ ఉంటారు. నిశితంగా గమనిస్తే నిజానికి పిల్లలలో సహకార భావం, ఇతరులకు సహాయం చేయాలనే తలపు సహజ సిద్ధంగా ఉంటుందనే విషయం అవగతమవుతుంది.

ఈ సహకార భావం దాదాపు అందరు పిల్లలలో అన్ని విషయాలలోనూ ఒకే విధంగా ఉంటుంది. ఇది అన్ని సందర్భాలలోనూ బయట పడకపోవచ్చు. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రకంగా బయటపడుతూ ఉంటుంది. పాఠ్యపుస్తకాల విషయంలోనే కాక డబ్బులు, చిరుతిండ్లు, ఇతర విషయాలలోనూ ఒక్కొక్కసారి పెద్దల కన్నా పిల్లలే ఎక్కువ సహకార భావం కలిగి ఉండి సహాయం చేసేందుకు ముందుకు వస్తుంటారు. చిరుతిండ్లు తింటున్నపుడు 'నాకు కూడా కొంచెం పెట్టు' అని ఎవరైనా అడిగితే ముందు పెట్టను అని అన్నప్పటికీ రెండుమూడు సార్లు అడిగితే తప్పక తాను తినేదానిలో కొంత ఎదుటి వారికి పెట్టడం చూస్తుంటాం.

ఇటువంటి సహకార, ఉదార స్వభావం బాలల్లో ఎదుగుతున్న కొద్దీ తగ్గడానికి తల్లిదండ్రులు, పెద్దలే కొంతవరకు కారణమని చెప్పవచ్చు. తల్లిదండ్రులు, పెద్దలు, పిల్లలకు ఏమైనా ఇచ్చి 'ఇతరులకు పెట్టవద్దు జాగ్రత్తగా దాచుకో. అడిగినా సరే ఇవ్వవద్దు' అంటూ సలహాలు ఇస్తుంటారు. మొదట్లో ఇటువంటి సలహాలు పట్టించుకోకపోయినా ఎప్పుడూ పెద్దలు ఇటువంటి సలహాలిస్తూ ఉండటంతో బాలబాలికలు ఉదార స్వభావం, ఇచ్చిపుచ్చుకునే స్వభావం తగ్గిపోయి వారిలో సంకుచిత స్వభావం అంకురించటానికి అవకాశం కలుగుతుంది. ఇది వయస్సు పెరిగే కొద్దీ ఎక్కువయ్యే ప్రమాదం ఉంది.

బాల్యంలో నేర్చుకొన్న, సహజ సిద్ధంగా అబ్బిన అలవాట్లు వారి భావి జీవితంలో తప్పక ప్రభావాన్ని చూపిస్తుంటాయి. అందుకే బాలల్లో ఉదార స్వభావం, ఇచ్చిపుచ్చుకొనే స్వభావం గురించి విపులంగా విశదీకరించాలి. వీటి ద్వారా కలిగే ఉపయోగాలు వారు తెలుసుకొనేలా చేయగలగాలి. బాలబాలికల్లో ఉన్న ఉదార స్వభావం ముఖ్యంగా జట్లుగా ఉన్నప్పుడు ఎక్కువగా బయటపడుతుంది. ఈ స్వభావం లేని బాల బాలికలలో దీన్ని అలవాటు చెయ్యడం అవసరం. దీనికి గృహ పరిసరాలు, పాఠశాలలే అనువైన వేదికలు.

చిన్నారులలో ఉదార స్వభావం కలవారిని అందరూ ఇష్టపడటం చూస్తూ ఉంటాం. అటువంటి వారికి అభిమానులూ ఎక్కువే. ఆ పిల్లలతో స్నేహం చేసేందుకు ఇతరులు తహతహలాడుతుంటారు. వారిని కలవరిస్తుంటారు. మిగిలిన వారికి ఇటువంటి స్వభావం కలవారు నాయకులుగా వ్యవహరిస్తారు. కొంతమంది ఎప్పుడూ వీరితో ఉండి వీరిని అనుసరిస్తూ ఉంటారు.

ఉదార స్వభావం కలవారిలో దయ, జాలి, కరుణ కూడా ఎక్కువే. వీరు సున్నితమైన మనస్తత్వం కలిగి ఉంటారు. ప్రతిచిన్న విషయానికీ వెంటనే స్పందిస్తారు. తమ ఉదార స్వభావంతో అందరినీ ఆకట్టుకొంటూ వారి ప్రేమాభిమానాలకు పాత్రులవుతారు. ఇటువంటి లక్షణాలు కలవారు భావి జీవితంలో కూడా మంచి పౌరులుగా తయారవుతారు. బాలలకు తొలి పాఠశాల అయిన ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలోని ఉపాధ్యాయులు చిన్నారులలో ఉన్న ఉదార స్వభావాన్ని గుర్తించి దాన్ని ప్రోత్సహించేందుకు సిద్ధపడాలి. కొన్ని లక్షణాలు బాల్యంలోనే అలవడాలి. వారిలో అలవడిన లక్షణాలను ఎక్కువ మంది పెద్దవారైనప్పటికీ ఆచరిస్తుంటారు. చిన్నారులలోని ఉదార స్వభావాన్ని బాల్యంలోనే తుంచివేయకుండా కాపాడాలి. కొంతమంది మిత్రులకు సాయం చేస్తుంటారు. కొంతమంది ముసలి వారికి, కొంతమంది పేదవారికి, మరికొంతమంది వికలాంగులకు, ఇంకొంతమంది చుట్టు పక్కల వారికి తోడ్పడుతూ తమ వంతు ఉదార స్వభావం చెప్పకనే తెలియజెబుతుంటారు. పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇటువంటి స్వభావాన్ని తృణీకరించకుండా అటువంటి పనులు చేసినపుడు వారిని అభినందిస్తూ, ప్రోత్సహిస్తూ ఉంటే వారిలో కలిగే ఆనందం చెప్పనవలవి కాదు. అలాకాకుండా ఆ పనెందుకు చేశావు ? అలా ఎవరు చేయమన్నారు? ఇలా చేశావేమిటి? అలా చేయకూడదంటూ నిరుత్సాహ పరచకూడదు. అభినందనల ద్వారా బాలలు ఉదార స్వభావం మరింత పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. నిరుత్సాహపరచడం వల్ల తమలో అంతర్గతంగా ఉన్న ఉదార స్వభావాన్ని పరిస్థితులను బట్టి తమలోనే అణచివేసుకుని కేవలం తమ లాభం మాత్రమే చూసుకునే సంకుచిత స్వభావం అలవరచుకునే ప్రమాదం ఎంతైనా ఉంది. ●

తెలివి

పూర్వం ఒక గ్రామంలో ఓ గొప్ప పండితుడు వుండేవాడు. అతను ఏకసంతాగ్రాహి. మంచికవి. కాని పేదరికంతో చాలా కష్టాలు పడేవాడు. 'ఇలా దరిద్రంతో ఎన్నిరోజులు పస్తులుంటాం. మన రాజుగారు సాహితీ ప్రియుడని విన్నాను. ఆయన దర్శనం చేసుకొని మీ పాండిత్యాన్ని ప్రదర్శించి మెప్పిస్తే కానుకలు ఇస్తారు. మన కష్టాలు తీరతాయి' అని భార్య అతనికి అనేకసార్లు చెప్పింది. ఒకసారి సరేనని రాజధానికి బయలుదేరి వెళ్ళాడు పండితుడు. రాజుగారికి సమర్పించుకొనేందుకు అతని దగ్గర చిల్లిగవ్వకూడా లేదు. అలాంటివాడు ద్వారపాలకులకు ఏమివ్వగలడు. అందుకే భటులు అతనిని లోనికి అనుమతించలేదు. రాజుగారి దర్శనభాగ్యం లభించక ఇంటికి వట్టి చేతులతో వెళ్ళలేక రెండు రోజులపాటు రాజధానిలోనే చెట్లకింద గడిపాడు. ఒకనాడు అక్కడ ఇద్దరు పరభాష మాట్లాడే స్త్రీలు గొడవపడటం చూశాడు. వారి తగాదా చిలికి చిలికి గాలివాన లాగా పెద్దదయింది. జుట్లు పట్టుకొని కొట్టుకునే వరకు వెళ్ళింది. ఇది గమనించిన రాజభటులు వారిద్దరినీ రాజుగారి ముందు హాజరు పరిచారు. ఏమి జరిగిందని రాజు అడిగారు. వెంటనే ఆ మహిళలు అక్కడకూడా తప్పు నీదే అంటే నీదే అని పరస్పరం నిందారోపణ చేసుకున్నారు. ఇలా లాభంలేదని

రాజుగారు భటులను పిలిచి వారి పోట్లాటను చూసిన వారెవరైనా వుంటే తీసుకురమ్మని పంపించాడు. వారు వెళ్ళి చూడగా అక్కడ ఈ పేద బ్రాహ్మణుడు కనిపించాడు. 'నీవు వారి తగాదా చూశావా?' అని అడిగితే చూశానని చెప్పాడు. 'అయితే పద' అని భటులు అతనిని రాజుగారి దగ్గరకు తీసుకువెళ్లారు.

ఏమి జరిగిందో వివరంగా చెప్పమనగా ఆ పండితుడు 'రాజా నాకు వారి భాష అర్థం కాలేదు. కాని వారేమి మాట్లాడారో యథాతథంగా చెప్పగలను' అన్నాడు. అయితే చెప్పమన్నాడు రాజు. అక్షరం పొల్లుపోకుండా వారిద్దరి సంభాషణను పండితుడు వినిపించాడు. రాజుతోపాటు సభలోనివారంతా అతని సామర్థ్యానికి ఆశ్చర్యపోయారు. 'భాష తెలియకపోయినా ఇంత చక్కగా వారు అన్నవి అన్నట్లు ఎలా చెప్పగలిగావు. నీవెవరివి? ఏ పని మీద ఇక్కడకు వచ్చావు?' అని రాజు ఆరా తీశాడు. పండితుడు తనొచ్చిన పని, తన పాండిత్యం సంగతి వివరించాడు. 'ఏదైనా ఒకసారి వింటే చాలు. దానిని మరిచిపోకుండా మరలా వున్నదున్నట్లు చెప్పగలను. మీ దర్శనం చేసుకొందామని వస్తే ద్వారపాలకులు అడ్డగించారు. లంచం ఇవ్వలేదని లోనికి రానివ్వలేదు' అని వినయంగా చెప్పాడు.

రాజుగారు తన ఆస్థాన సిబ్బంది దురాశకు నొచ్చుకున్నారు. ఇలా ఎంత మంది అసౌకర్యానికి గురి అవుతున్నారోనని విచారించారు. తర్వాత ఆ పండితుని సత్కరించి తన ఆస్థానంలో ఉద్యోగం ఇచ్చారు. తన సిబ్బంది ఇక ముందు ఇలాంటి తప్పులు చెయ్యకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ●



క్విజ్-69

1. ఎన్నికల తేదీని నిర్ణయించు సంఘము?
   ఎ.ఎన్నికల కమీషన్ బి. పబ్లిక్‌సర్వీస్ కమీషన్
2. 'ఆముక్తమాల్యద' పుస్తక రచయిత ఎవరు?
   ఎ.శ్రీకృష్ణదేవరాయులు బి. అల్లసానిపెద్దన
3. మొదటిగా అణుబాంబు వేసినది?
   ఎ. హిరోషిమా బి. నాగసాకి
4. శ్రీలంక రాజధాని?
   ఎ. రంగూన్ బి.కొలంబో
5. గవర్నరు పదవీకాలము?
   ఎ.5 సంవత్సరాలు బి.6 సంవత్సరాలు
6. చార్మినార్ నిర్మించినది?
   ఎ. మహ్మద్ తుగ్లక్ బి. మహ్మద్ కులీకుతుబ్‌షా
7. పెద్ద పెద్ద భవనములు కట్టడానికి ఉపయోగించేది?
   ఎ.సున్నం బి. రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీటు
8. బట్టలమీద నూనె మరకలు పోవడానికి వాడేది?
   ఎ.నిమ్మరసము బి. బెంజిన్
9. రబ్బరుపై బలాన్ని ప్రయోగించి తీసివేసినపుడు యథాతథస్థితి పొందడాన్ని ఏమంటారు?
   ఎ.స్థితిస్థాపకత
   బి.పెళుసుదనం
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ.మేఘావతి సుకర్ణోపుత్రి
   బి. ఆంగ్‌సాంగ్‌సూకీ

భో...భో...భో...!

ఈ రెండు బొమ్మలను చూశారుగా! ఏంటి అంతగా ఆశ్చర్య పోతున్నారు. పై బొమ్మ చూసి కింద బొమ్మను పూరించాలి. అంతే.... భో...భో...భో...వచ్చేస్తుంది.





చిన్నారి చిత్రకారులు



ఎం. హరీష్ కుమార్, 10వ తరగతి, శ్రీవిశ్వశాంతి పబ్లిక్ స్కూల్, చినకాకాని, గుంటూరు.



కూర మాధవి, 8వ తరగతి, ముద్దెంగూడ, రంగారెడ్డి.



కె.గణేష్, 4వ తరగతి, ఆంధ్రా పబ్లిక్ స్కూల్, హరిపాలెం, విశాఖ.



కాలువ తన్మయ, 1వ తరగతి, అరండల్‌పేట, గుంటూరు.



ఎం.ఆషాకుమారి, 8వ తరగతి, చినకాకాని, గుంటూరు.

గాలిలో నిలబడే బంతి



హాయ్! నోటితో గాలి ఊదుతూ బంతిని నిలబెట్టగలరా! 'గాలి ఊదితే ఎక్కడన్నా బంతి నిలబడుతుందా' అనుకుంటున్నారా? నిలబడుతుందికూడా. ఎలాగో తెలుసుకోవాలనుకుంటే ఈ వారం మేజిక్ మొత్తం చదవండే. ఇంతకీ ఈ మేజిక్ చేయడానికి ఏమేం కావాలంటే... స్ట్రాతో కూల్‌డ్రింక్ తాగుతాంకదా. అది ఒకటి తీసుకోండి. ఒక చివరను మీ నోట్లో పెట్టుకోండి. ఆ తర్వాత తలను వెనక్కు వాల్చి దాని రెండో కొనకు కొద్దిగా పైన ఒక టేబుల్ టెన్నిస్ బంతిని చేత్తో పట్టుకోండి. అప్పుడు మీరు ఎంత గట్టిగా ఊదగలిగితే అంత గట్టిగా ఊదుతూ, అదేసమయంలో బంతిని వదలండి. 'అయ్యయ్యో! వదిలేస్తే బంతి పడిపోతుందికదా' అనుకుంటున్నారా. అదేంలేదు. మీరు అనుకున్నట్టుగా బంతిపడదు. కావాలంటే ఊది చూడండి. బంతి ఎంచక్కా అలాగే గాలిలో నిలబడి వుంటుంది. మీరు ఎంత గట్టిగా ఊదితే బంతి అంత గట్టిగా పైకి లేస్తుంది.

దీనికి కారణం ఏంటంటే...గాలి వేగంగా కదులుతుంటే దాని ఒత్తిడి తగ్గుతుంది. గొట్టంనుంచి వేగంగా వచ్చే గాలి బంతి చుట్టూ వెళుతూ దాని చుట్టూతా తక్కువ ఒత్తిడిగల ప్రదేశాన్ని ఏర్పరుస్తుంది. మీరు బలంగా ఊదుతున్నప్పుడు బంతి గాలిలో నిలుస్తుంది. లేదా గొట్టంపై ఎత్తుగా పోతుంది.

ఇదీ సంగతి. వచ్చే వారం మరో ఆసక్తికరమైన మేజిక్ గురించి చెప్పుకుందాం. అందాక టాటా.

మేజిక్ మేజిక్!

క్విజ్ 68 జవాబులు

1. పుష్యభూతి 2. సాల్మన్ రష్దీ 3. సబర్మతి 4. రవీంద్రనాథ్ టాగూర్ 5. వస్త్రములు 6. ధృవపుజింక 7. 1:4 8. ...త్యరసము 9. పో 10. జానీ లీవర్

క్విజ్ 67కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎన్.ఆశాజ్యోతి, వి.మాదుగుల, వైజాగ్. **...వెంకటేశ్వర్లు**, 10వ తరగతి, **వి.పుల్లారావు, వి.యేసేబు**, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్స్కూల్, యర్రగొండపాలెం, ప్రకాశం. **జి.రమాదేవి**, 8వతరగతి, బ్రాడీపేట, గుంటూరు. **...ంటకోటఅమర్‌జయసింహ**, విల్లూరి అక్కయ్యగారివీధి, ...పాలెం, విశాఖ. **పి.లక్ష్మి**, 7వ తరగతి, పొన్నూరు, గుంటూరు.

కలం స్నేహం

పేరు: డి.రవికుమార్,
వయసు : 10సం॥
చదువు :5వ తరగతి
హాబీలు : క్రికెట్, క్యారమ్స్ ఆడడం, టీవీ చూడడం, సైకిల్ తొక్కడం.
పూర్తి చిరునామా :డి.రవికుమార్, సన్నాఫ్ డి.లక్ష్మిశెట్టి, గాంధీరోడ్డు, ఇం.నెం: 9/107, వేంపల్లె, కడపజిల్లా.

పేరు: మద్దూరి బ్రహ్మయ్య,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, కబడ్డీ ఆడడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా :మద్దూరి బ్రహ్మయ్య, 9వ తరగతి, సన్నాఫ్ కొండమ్మ, బిసి హాస్టల్, కొండెపి, ప్రకాశం.

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలశ్యం ఎందుకు!! ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలస్నేహాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

చీకూచింతా లేనివారు

ఓరోజు అక్బర్ చక్రవర్తి భోజనం చేసి తోటలో విహరిస్తున్నారు. ఎందుకో ఆయనకు ఆనాటి సభలో జరిగిన చర్చ గుర్తుకువచ్చింది. అదే సమయంలో ఆయనకో ఆలోచనకూడా వచ్చింది. అసలు మనిషి ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలని ఆలోచిస్తూ వుంటాడెందుకు? ఇది ప్రతిఒక్కరికీ వుంటుందా? ఈ తాపత్రయం లేనివారు ఎవరైనా వుంటారా? వుంటే వారెవరై వుంటారు? అన్న ప్రశ్నలు పాదుషాను కలవరపెట్టాయి. ఈ ఆలోచన వచ్చేసరికి ఆయనకు నిద్ర పట్టలేదు. మరునాడు మామూలుగానే సభకు వెళ్లారు. అక్కడ అంతా ఎవరి ఆసనాలలో వారు కూర్చుని వున్నారు. బీర్బల్‌కూడా తమ స్థానంలో వున్నారు. తనకు రాత్రి కలిగిన సందేహాన్ని తీర్చుకోవడానికిదే తగిన సమయమనుకున్నారు. అనుకున్నదే తడవుగా సభాసదులనుద్దేశించి ఇలా అన్నారు...'ప్రతిప్రాణీ కూడా ఏదో ఒక ఆలోచనతో, ఏదో ఒకటి చేయాలన్న తలంపుతో జీవితం గడుపుతోంది. అందుకని ఎప్పుడూ ఏదో ఒక చీకూచింతా పట్టి బాధిస్తూ వుంటుంది. ఇలాగాక అసలు బాధలేం లేకుండా జీవించేవారెవరైనా వుంటారా? వుంటే వారెవరు?' అన్నారు. పాదుషా ప్రశ్నకు ఒక్కరుకూడా సరైన జవాబు చెప్పలేకపోయారు. అందరూ ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ 'ఎవరు' అని కళ్లతోనే ప్రశ్నించుకున్నారు. 'నీవైనా చెప్తావా!' అన్నట్టు చక్రవర్తి బీర్బల్‌వైపు చూశారు. 'ప్రభూ! మీ ప్రశ్నకు అంత తొందరగా సమాధానం దొరకదు. సృష్టిలో ప్రతి ప్రాణికీ ఏదో ఒక చీకూచింత వుంటుంది. అయినా మీరు కోరిన చీకూచింతా లేనివారు మూడేళ్లలోపు పిల్లలే' అన్నారు. అక్బరుకు ఈ సమాధానం నచ్చి బీర్బల్‌ను సత్కరించారు.



అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత



అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్న భారతీయుడు అమర్త్యసేన్. ఈయన 1933వ సంవత్సరంలో శాంతినికేతన్‌లో జన్మించారు. కోల్‌కతా, కేంబ్రిడ్జ్‌లలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ విశ్వవిద్యాలయాలలో బోధించారు. ప్రజాసంక్షేమ ఆర్థికరంగానికి తోడ్పడినందుకుగాను అమర్త్యసేన్‌కు ఈ బహుమతి లభించింది.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	మ్మ
	పురూప
	క్రమం
	జీర్ణి
	గ్రజుడు
	పఖ్యాతి

గతవారం జవాబులు

ప	ని
	లక
	సుపు
	కోడీ
	గలు
	లుగు

✻ రుక్మిణి

గంబూషియా... జై స్వర్ణాంధ్రా



"అబ్బో... అబ్బో... అది ఒక సుందర బృందావనం... అద్భుతమైన ఆ సొగసులు చెప్పనలవి కాదు. రాజసౌధం... అక్కడి నేలా... ఛ... ఛ... మన నగుమోములు చూసుకునేలా తీర్చి దిద్దిన అతికిన పాలరాతి గచ్చు.. మెలకువ లేకుంటే సర్రున జారి బొక్క బోర్లా పడాల్సిందే..

"ఆపమన్నానా?" వృద్ధ నాయకుడు కృద్ధుపై గుర్రుగా అనేసి పనిలో నిమగ్నమయ్యాడు.

"గోడలు... మెరుపు పూతలు.. ధగధగా... మచ్చుకైనా మరకన్నది కనిపించని ఆ భవనంలోని గదులు... వరండాలు...

"ఓర్నీ... దొరక్క దొరక్క ఇన్నాళ్లికి కంటికింపుగా బాబుగారి పుణ్యమాని సమృద్ధిగా ఈ 'భోజనం' దొరికింది. ఆబగా తింటుంటే అదేం మతిమాలిన నీచం మాటలు... యాఖ్" అని వృద్ధ నాయకుడు మురికి గుంటలోని అప్రాచ్యాన్ని... కుళ్ళిన 'ఈసడింపు'ను ఆప్యాయంగా లపలపా మెక్కసాగాడు. ఆ మురికి గుంటనిండుగా వేలకొద్ది దోమలు... లుకలుకలాడిపోతున్నాయి – వాటన్నిటికీ వయసు మళ్ళిన ఆ 'దోమరాజు' నాయకుడు.

"అబ్బో... లోపల టేబిళ్ళ మీద అమర్చిన పళ్ళాలలోని భోజనాలు... అత్యంత పరిశుభ్రంగా... అందంగా...

"అట్లాంటి 'కుళ్ళు' మాటలు మాట్లాడితే జన్మాంతం తిండి.. బువ్వ దొరక్క మలమల మాడి చస్తవ్.. ఛు... అవతలేమో పచ్చదనం... పరిమళం... యాఖ్ వూడబొడిసినట్లే వుంది – తిను... తిను... అవతల బోలెడంత పనుంది.. ఒరే... ఇవాళ 'రగతాల పండగ' చేసుకోవాలె.. రాత్రి కాంగనె రక్తం పీకుడే పీకుడు.. మనల్ని ఎవడ్రా సవాలు చేసేది..." అని వృద్ధ నాయకుడు బక్క తొడల్ని చరిచి కసరడంతో యువదోమ మరి మాట్లాడకుండా 'కంపు'ను భోంచేయడంలో మునిగిపోయింది.

అపుడే ఓ పెద్ద దోమల గుంపు పక్కూరి నుండి వచ్చి మురికి మీద వాలింది. "తాతా... మీరే అదృష్టవంతులు.. అడవులు పట్టుక తిరిగే మాకేం లాభం లేదు. గీ మున్సిపాల్టీ గ్రామ పంచాయతీ వాండ్లు నెలల బట్టి గీ కుప్పలెత్తకపోడం... కాల్వలు సుబ్రం చేయించక పోటం మీ అదృష్టం!"

"గదంతా గా కంట్రాక్టర్ల దయ... చెంద్రబాబుగారి ప్రసాదం... మహానుభాగుడు... మొత్తం గీ పన్లంటినీ గుత్త ప్రైవేటు కంట్రాక్టర్లకు అప్పజెప్పినాక ఇంగ మన పంట పండిందనుకో.. అసలు వాండ్లు గిటువైపు ఆ వున్న కంట్రాక్టు పనోల్లనే పంపరు – వీట్ని సుబ్రం చేయించరు... బిల్లులు మెక్కడమే సరిపాయె... గందుకని ఇందులో మా అదృష్టం... ఘనకార్యం పొడుచుకున్నదేం లేదు గానీ మా పొట్టలు నిండిపోతున్నాయిర... ఎట్లుందిర మీ ఊర్లెవేట..!" వృద్ధనాయకుడు కుశలమడిగాడు.

"ఏం ఫర్లేదు తాతా... అడువుల్నుండి గుడిసెలోల్ల మీద పడ్డం.. గరీబోళ్ళ సంఖ్య పెరిగిపోతాండె! అస్సలు పనీపాటల్లేక... దోమతెరల్లేక చింకి సాపల మీద ఆకలికి కాళ్ళు ముడేసుకుని మూలుక్కుంట ఆకలికి చొంగలు కారుస్తూ పడుకున్నోళ్ళందరూ మన పాలేనాయె! వాండ్ల రక్తం తాగి తాగి 'రక్తహారం' నోరు సచ్చి గిటు మురికి మీదికి విరుసుకు పడ్డం...

"గద్సరె గాని... వాండ్ల రక్తం రుచిగ లేదుర...!" మరో ముసిలి దోమ నోరు చప్పరిస్తూ అడిగింది.

"ఏం రుచోగానీ... మనం ఎగబడ్డాక వాళ్ళందరూ చలిజెరాలతో ఆసుపత్రుల వెంటబడిపోతే ఏమయింది. అక్కడ మందులే లేవాయె! అంతా ప్రైవేటు... మరి యూజర్ చార్జీలు గద.... ఇంగ వాండ్లు అట్నుంచి అటే బొందల గడ్డకి..." మరో దోమ వికవిక నవ్వింది. అపుడే అక్కడి దోమలు మిక్కిలి అలజడికి లోనై హాహా కారాలు చేశాయి – కొన్నయితే జడుసుకుని పైకి లేచాయి. మరికొన్ని తమ నాయకుని వెనక నక్కాయి– "శత్రువులు... హమ్మో..." అని కీసర బాసరగా జుయ్యిమని గోల మొదలెట్టాయి. పెద్ద ఈగల గుంపోటి వచ్చి పెంటకుప్పల మీదా... మురికి కాలువలోని గలీజు మీదా గప్పుమని వాలిపోయాయి.

అందులో నుండి బాగా బలిసి బొర్ర పెంచుకున్న ఈగల రాజు ఠీవీగా ముందుకు వచ్చి ఇట్లా పలికిన వాడాయెను. "మిత్రులారా... మనం శత్రువులం కాదు. ఇది మనకు బాబుగారిచ్చిన ఆహారం.... తింటున్న కొద్దీ సమృద్ధిగా దొరుకుతుంది. వారి చలవ! దీన్లో మనలో మనం కీచులాడకుండా కలిసికట్టుగా భోంచేస్తూ శుభంగా... ఇతోధికంగా మన సంతానాభివృద్ధికి పాటు పడుతూ... మన జనాభాను విపరీతంగా పెంచుకుంటూ పోవడం మనకు సర్వదా మంగళప్రదం... విజయం మనదే... శాంతి... శాంతి...

"విజయం ఎవరి మీదా... శాంతి ఎవరికీ?" ఒక పడుచు దోమ పిల్ల పరాచికాలాడింది.

"కంటితుడుపు చర్యగా అటు ఫాగింగ్ మిషన్లనీ... పొగ దెబ్బా అనీ... ఒకవైపు – మళ్లా బ్లీచింగ్ పౌడర్లు జల్లుకోడానికి గ్రామ పంచాయితీలకు నిధులనీ... విడుదల చేస్తున్నారు – మరి శత్రువుల కదలికల్ని గమనించకపోతే మనికే డేంజరు గదా!" ఈగల రాజు కాస్తంత బేలగానే అన్నాడు.

"ఓసోస్... అట్లాంటి మాటలు ప్రతి 'జన్మభూమి'లోనూ మనం వింటున్నదే... అసలీ జన్మభూములలోనే మన పంట పండిపోతుందిగాదు – డబ్బులు తీసుకోడానికి ఆర్భాటపు అవాకులు... చెవాకులు.. ఎవడికీ ఎక్కడా పైసా ఖర్చే కాకుండా అంతా కంట్రాక్టర్లే మింగుతావుంటే మనకు పండగే పండగ! గీ హుంకరింపులకు మనం భయపడం... కల్తీ చేసిన ఈ మందులను ఈ కంట్రాక్టర్లు చల్లినట్లు చేస్తారు. వాటిని ఇముడ్చుకుని మా పిలకాయ .లెట్లా బలిసి వస్తాదులై పోతున్నారో చూడు.

ఆ మాట ముగించేలోగానే ఓ యువక దోమల బృందం ఒళ్ళు విరుచుకుని... కల్తీ పురుగుల మందు దెబ్బకు పెంచిన ఒంటిమీదా... తొడల మీదా ఫెళ్ళుఫెళ్ళున చరిచి వున్న అయిదారు మీసాలను మెలేసి హుంకరించాయి.

"భాగానే వుంది – మేమూ అట్లాంటి కుర్రకారు వస్తాదుల్ని తయారు చేసుకోవాలె.." ఓ ముసలి ఈగ సాలోచనగా అంది.

వున్నట్లుండి ఈగల... దోమల గంపులో కలకలం చెలరేగింది. ఓ బ్రహ్మాచారి దోమ పరుగున వచ్చి రొప్పుతూ విషయం వెల్లడించింది "తాతా.. గంబూషియా చేప పిల్లలు... వామ్మో... ఈ మురిక్కాలవల్లో వాట్ని వదులుతారట! రాకాసి చేపలు. నాకు భయంగా వుంది!"

ముసలి దోమల నాయకుడు ముసిముసిగా నవ్వాడు "ఓరి వెర్రివాడా... ఆహ్హా... జనాలకు ఇగ జంబూషియా జంత్రం... ఒరే... ఇది ప్రపంచబ్యాంకు... దాని ఒప్పందం షరతుల కాలం... చంద్రబాబుగారి స్వర్ణాంధ్ర... కంట్రాక్టర్ల పండగరోజులు... ప్రైవేటు ప్రతాపం.. గంబూషియా చేపల్ని వదలమంటే వాండ్లు ఏ చవకరకం పరకల్నో... ఇసకదెందుల్నో వదిలి ఇనపెట్టెల్ని నింపుకుంటారు – ఏం భయం లేదు – అయినా గీ ప్రతాపం అంతా రేపు అసెంబ్లీ ఎన్నికల వరకే... తర్వాత మన జోలికెవడూ రాడు. మరి ఈ కుంటలూ.. చెత్తకుప్పలూ మనవే... మనదే సర్వాధికారం... విజయం మనదే... ఈగల దోమల ఐక్యతా వర్ధిల్లాలీ... గంబూషియా డౌన్... డౌన్...!

అలిగిన అర్ధాంగి అందంగా వుంటుందని రూలు! సాక్షాత్తు శ్రీకృష్ణుడే ఈ స్టేటుమెంటు నిజం నిజం సుమాని నొక్కి మరీ చెప్పేడు. శ్రీవారి అనుభవం అలాంటిది! సత్యభామ అలిగి అలక పాన్పు ఎక్కింది. దాంతో ఆమెను బతిమిలాడుకునే ప్రయత్నంలో భాగంగా - ఆమె పాదాల దగ్గిర కూచున్నాడు! తన తలని కావాలని ఆమె పాదానికి అంటించేడు! ఈ కార్యక్రమంలో మహానుభావుడు కించిత్తు కూడా సిగ్గు పడలేదు. నీకాల్తో నన్ను కొట్టి సుఖపెట్టు సత్యా అని డైరెక్టుగా అడక్కుండా అట్నుంచి నరుక్కొచ్చి భార్యతో కాలిదెబ్బ తిన్నాడు. అంతటితో సరిపెట్టకుండా నీ లేత పాదానికి దెబ్బ తగల్లేదు గదాని మెలోడ్రామా డైలాగు ప్రయోగించేడు. స్వామిని తన పాదంతో కొట్టి పాపం మూట కట్టుకున్నానేమోనని ఆ ఇల్లాలు విలవిల్లాడి పోయింది. తన ఆలక నోము విడిచేసి అపరాధం జరిగిపోయింది స్వామీ క్షమించమని వేడుకుంది!



అలక పురాణం

ఆయన క్షమించారో లేదోగాని - చిద్విలాసంగా నవ్వేసేరు! ఆ నవ్వులోనే వుంది మాయ! పెనుమాయ! మగాళ్లందరికీ బాగా ఉపకరించే చిట్కా అది! అదుగో - సరిగ్గా అప్పట్నుంచే మగజాతి ఆయనను ఆదర్శంగా పెట్టుకుని సంసారాలు చేస్తున్నారు. ఆడవాళ్ళే పాపం - సత్యభామ లాగా మాయలో పడి అల్లాడి పోతున్నారు. ఆమెకు కోపం రాదు. వస్తే గిస్తే అతనేదో మేజిక్కు చేస్తాడు. దాంతో ఆమెకొచ్చిన కోపం క్షణం పాటైనా నిలబడకుండా ఉష్‌కాకి అయిపోతుంది! సత్యభామ టైపులో నన్ను క్షమించండి అనేస్తుంది. అప్పుడతను సాక్షాత్తు శ్రీకృష్ణుడల్లె చిద్విలాసంగా నవ్వేస్తాడు. ఆమె తల మీద చెయ్యి వేసి పిచ్చిదానా అని కూడా అంటాడు. అదేదో మహత్తరమైన బిరుదని ఆమె మురిసిపోతుంది. అంతేగాని - అది ఆమె పట్ల అతని గుండెల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న అభిప్రాయమని తెలుసుకోలేదు!

అర్ధాంగి అంటే భర్తలో సగభాగం సొంతం చేసుకున్న మనిషి అని మగకవులే అర్థతాత్పర్యాలు చెప్పి జాగ్రత్త పడ్డారు. అంచేత ఎంతకోపంతో వున్న భార్య అయినా - సదరు ఆమె భర్త అర్ధాంగీ అని పిలవగానే అయిసైపోతుంది! తన శరీరంలో సగభాగం ఇచ్చిన పతిదేవుడ్ని పలు విశాల బాధల పెట్టడం మంచిది కాదని తనకై తానే ఒక నిర్ణయానికి వచ్చేస్తుంది. ఇంక ఎక్కడి అలక? అర్ధాంగి అనే పిలుపుతో అటక ఎక్కుతుంది! భార్యనైతే అర్ధాంగీ అని పిలిచి మగమారాజు ఆమెను దార్లో పెట్టుకుంటున్నాడేగాని - భర్తని భార్య అర్ధాంగుడా అని పిలిస్తే ఎలా వుంటుందో చూడాలి. ఏతావాతా - అలగడమే ఆడవాళ్ళ ప్రత్యేకతగా భావించడం పెద్ద తప్పు!

మగవాళ్లు కూడా అలుగుతారు! అయితే వాళ్ళు నిజాయితీగా అలగరు. అంటే వాళ్ళ అలకలో నిజాయితీ వుండదు. అన్నీ డ్రామా అలకలు. కుట్రతో కూడిన అలకలు! ఆ అకలకల్లో గొప్ప గొప్ప ట్రిక్కులుంటాయి! మడతలుంటాయి! మెలికలుంటాయి...! బోలెడు మతలబులుంటాయి! ఇష్టం లేని కూరలు ఇంట్లో వండినప్పుడు - ఆ భర్తకు నోట్లో ముద్ద దిగదు గనుక ఆ రోజు చాలా అనవసరంగా అలుగుతాడు! ఈ కొంపలోనే కాదు ఈ భూలోకంలోనే భోం చేయనని అరుస్తాడు. ఆ ప్రతిజ్ఞకి ఆమె భయపడుతుంది. పొరపాటున మీకిష్టం లేని కాకరకాయ వేపుడు చేసేను - క్షణం ఆగితే మీ ఫేవరిట్ కొబ్బరి పచ్చడి చేస్తానని ప్రాధేయపడుతుంది. అతనిక్కావలసింది కూడా కొబ్బరి పచ్చడి మాత్రమే! కాకరకాయ వేపుడు పూర్తిగా నిషేధించాలి! అంచేత భార్యామణి ఎంత ప్రాధేయ పడుతున్నా వినకుండా స్కూటరెక్కి తుర్రుమంటాడు!

కొబ్బరి పచ్చడి దొరికే హోటలు వెతికి పట్టుకుంటాడు. ఆ పచ్చడితో సుష్టుగా భోంచేసి ఆఫీసుకు వెడతాడు. ఇంటి నుంచి ఫోను వస్తే - అయ్యగారికి నీరసంగా వుండి ఎవర్తోనూ మాటాడటం లేదని ప్యూన్‌తో బదులు చెప్పిస్తాడు. ఇది బిల్డప్ నెంబరు ఒకటి! బాగా పొద్దు పోయింతర్వాత కొబ్బరి పచ్చడి హోటలుకు వెళ్ళి అక్కడే భోంచేసి - వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న టైపులో ఇంటికొచ్చి నీరసం నటిస్తూ మంచం ఎక్కుతాడు. ఇది బిల్డప్పు నెంబరు రెండు ! ఈ రెండు బిల్డప్పులూ ఆమెను పూర్తిగా బెదరగొడతాయి. ఈ కాకరకాయ గొడవ తన పచ్చటి సంసారంలో ఏం చిచ్చు పెడుతుందోనని కలవర పడుతుంది. ఇక జీవితంలో కాకరకాయ వేపుడు చేయనుగాక చేయనని ఆమె అగ్నిసాక్షిగా ప్రతిజ్ఞ చేస్తుంది. ఆ ప్రతిజ్ఞ కోసమే అతనింత రభస చేస్తున్నాడని ఆమెకేం తెలుసు? ◆

పి.రాజేంద్రుడు



నీరు ఉబికి వచ్చే ప్రాంతం ఇదే.

ప్రకృతివరం.. కాల్వబుగ్గ రామేశ్వరం

కర్నూల్ జిల్లావాసులకు ప్రకృతి ప్రసాదించిన రెండు సజీవ జలవనరులున్నాయి. దేశమంతా దుర్భిక్షం తాండవించినా ఈ రెండు జల వనరులు చుట్టుపక్కల గ్రామాల దాహార్తిని తీరుస్తాయి. అందుబాటులో ఉన్న మేర పంటపొలాలకు జీవం పోస్తాయి. వాటిలో ఒకటి మహానందిలో ఉండగా రెండవది జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఏడవ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉంది.

రహదారి పక్కనే గల రామేశ్వర ఆలయ గోపురం కింది నుండి ఉబికి వచ్చే జలధార నిరంతరం పారుతూనే ఉంటుంది. ఆలయం పక్కనే గల కోనేరు ఈ నీటితో ఎప్పుడూ నిండుగా ఉంటుంది. అడుగున గల ఇసుక ఎంతో స్పష్టంగా కనిపిస్తూ అక్కడి నీరు అత్యంత స్వచ్ఛంగా, ఎంతో తీయగా ఉంటుంది. దేవాలయం కంటే ప్రకృతి ప్రసాదించిన నీటి బుగ్గను చూసేందుకు ఎంతో మంది యాత్రికులు ఇక్కడకు వస్తుంటారు. భూమిపైనుండి నిత్యం ఉబికివచ్చే నీటితో సుమారు ఐదు గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుంది. వేసవి కాలంలో కూడా ఇదే మోతాదులో నీరు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆలయం అడుగు నుండి నీరు ఎలా ఉద్భవిస్తుందో కనిపెట్టడం కోసం అనేకమంది విఫల యత్నం చేశారు. శాస్త్రవేత్తలకు అంతుబట్టని రీతిలో మండు వేసవిలోనూ, కరువు కాలంలోనూ ప్రజల ప్రాణాల్ని కాపాడుతోంది. పండుగల సమయాన, ఆదివారం, శెలవు దినాల్లోనూ కాల్వబుగ్గ రామేశ్వర ఆలయం పర్యాటకులతో కళకళలాడుతుంది. ఈ క్షేత్ర ప్రసిద్ధి తెలిసినవారు, నీటి బుగ్గ గురించి తెలిసిన వారు వందలాది మంది చుట్టుపక్కల జిల్లాల నుండి వచ్చి ప్రకృతి ఒడిలో సేద తీరి వెళుతుంటారు. పర్యాటక అభివృద్ధి గురించి విపరీత ప్రచారం చేసే ప్రభుత్వం ఇంతవరకు ఈ క్షేత్రం గురించి పట్టించుకోనేలేదు. ఇటీవల బయల్పడిన బెలూం గుహల గురించి ప్రచారం చేస్తున్నదే గాని వందల సంవత్సరాల నుండి జీవజలాన్ని అందిస్తూ ఆశ్చర్యం కలిగిస్తున్న కాల్వబుగ్గను నిర్లక్ష్యం చేస్తున్నది. అందువల్లనే దీని గురించి జిల్లాలో మినహా బయటి వారికి పెద్దగా తెలియదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని యాత్రికుల కోసం వసతిగృహాలు నిర్మించి, ప్రచారం చేస్తే ఇది మంచి పర్యాటక కేంద్రంగా మారుతుంది. ప్రభుత్వానికి ఆదాయమూ సమకూరుతుంది. జాతీయ రహదారి పక్కన ఉండటం వల్ల రవాణా ఇబ్బందులు కూడా ఉండవు.

ఆలయ చరిత్ర

పూర్వం మహాతపస్సంపన్నుడైన జమదగ్ని, రేణుకాదేవి పుణ్యదంపతుల సప్తమకుమారునిగా పరశురాముడు జన్మించాడు. ఈయన తన తండ్రిని సంహరించిన క్షత్రియరాజులను దేశ నలుమూలలు శోధించి నిర్మూలించాడు. యుద్ధంలో జరిగిన రక్తపాతానికి మనస్తాపం చెందిన పరశురాముడు తన దోష నివృత్తికై ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన రెండు కొండల నడుమ స్వచ్ఛమైన నీటి పుష్కరిణిలో గలగల పారే సెలయేరు ఒడ్డున నాడు ప్రతిష్ఠించిన శివలింగమే నేటి కాల్వబుగ్గ రామేశ్వరం. ఈ పుణ్యక్షేత్రానికి వాయవ్య దిశయందు గల నీటి బుగ్గ(పుష్కరిణి) ద్వారా ఉబికివచ్చే నీరు హుస్సేనాపురం, కాల్వ తదితర గ్రామాల భూములను సస్యశ్యామలం చేస్తుంది. అందువల్లనే ఈ ప్రాంతానికి కాల్వబుగ్గ అనే పేరు వచ్చింది. ఈ క్షేత్ర చరిత్రను తెలిపే శిలాఫలకాలు ఇక్కడికివచ్చే యాత్రికులకు ఆలయం చుట్టుపక్కల దర్శనమిస్తాయి. ప్రస్తుతం ఇక్కడ నిత్యాగ్నిహోమం కూడా ఏర్పాటు చేశారు. 1978లో కంచికామకోటి జగద్గురువు ఈ ఆలయాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబికాదేవికి శ్రీచక్ర ప్రతిష్ఠ చేశారు. శ్రావణ, కార్తీక మాసాల్లో దేవాలయం కళకళ లాడుతుంది. శివరాత్రి పర్వదినాన శివశివ అంటూ ఇక్కడి పుష్కరిణిలో స్నానాలు చేసి ఉపవాస దీక్ష చేపడతారు. పర్వదినాన ఇక్కడ శివనామం మార్మోగుతుంది. సెలవు దినాల్లో చాలామంది పర్యాటకులు ఈ కోనేటిలో స్నానాలు చేస్తుంటారు. ఇది జాతీయ రహదారి పక్కన ఉండటం, విశాలమైన స్థలం ఉండటంతో చాలామంది వివాహాలకు దీన్నే వేదికగా వాడుకుంటున్నారు. కోవెలకు చుట్టుపక్కల ఉన్న పచ్చని కొండలు, మామిడి, కొబ్బరితోటలు స్వచ్ఛమైన సెలయేళ్ళు ఇక్కడకు వచ్చే యాత్రికులను ఆకర్షిస్తున్నాయి. ●



శ్రీబుగ్గరామేశ్వర స్వామి దేవాలయం

ఆరంభ శూరత్వం

క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి

రాష్ట్ర ప్రభుత్వానికి క్రీడలపై ఉన్న మమకారం ఆరంభ శూరత్వమేనని తొమ్మిదవ జాతీయ ఫెడరేషన్ కప్ పోటీలు నిరూపించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతనంగా నిర్మించిన గచ్చిబౌలి స్టేడియం గత ఏడాది నిర్వహించిన జాతీయ క్రీడలతో ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే గత నెల జరిగిన తొమ్మిదవ జాతీయ ఫెడరేషన్ కప్ అథ్లెట్ల పోటీల నిర్వాహణ పట్ల నిర్లక్ష్యం వహించడం ద్వారా క్రీడలపై తనకున్న అసలైన మమకారాన్ని ప్రభుత్వం చాటింది. జాతీయ క్రీడల ప్రారంభానికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర రాష్ట్ర ముఖ్యమంత్రులతో పాటు సినీ నటులను, వ్యాపార వేత్తలను, న్యాయమూర్తులను ఆహ్వానించి రంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతీయ స్థాయిలో జరిగిన ఫెడ్‌కప్ పోటీలకు కనీసం క్రీడా శాఖమాత్యులు కూడా హాజరుకాకుండా స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్రమంత్రి విజయరామారావుతో మొక్కుబడిగా కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రజలను మోసం చేస్తున్నారని గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న మహిరా సంస్థ అధినేత వంశీ కిషోర్ ఈ పోటీలకు స్పాన్సరర్‌గా వ్యవహరించాడు. ఇతని స్పాన్సర్‌షిప్‌ను రాష్ట్ర ప్రభుత్వం, క్రీడాధికారులు అంగీకరించడం ద్వారా తమ 'నిజాయితీ'ని చాటుకున్నారు.

ప్రచార లోపం ఫుల్-ప్రేక్షకులు నిల్

జాతీయ క్రీడలకు భూమ్యాకాశాలను ఏకం చేసే విధంగా కోట్ల రూపాయల వ్యయంతో ప్రచారం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఫెడ్‌కప్ క్రీడలకు నామమాత్రపు ప్రచారాన్ని సైతం నిర్వహించకపోవడంతో ప్రేక్షకులే కానరాలేదు. 18 రాష్ట్రాలు, 10 ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొన్న ఈ క్రీడలు ప్రేక్షకులు లేక వెలవెలబోగా పాల్గొన్న అథ్లెట్లకు వారి సహచరులే ప్రోత్సాహాన్ని అందించవలసి వచ్చింది. కొన్ని సమయాల్లో సహచరులు తమ ఆటల్లో నిమగ్నమవడంతో విజేతలను ప్రోత్సహించే నాథుడే కరువయ్యాడు. నిర్వాహకులు, పోలీసులు, పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు ప్రేక్షకులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అగ్రశ్రేణి అథ్లెట్లు దూరం

అగ్రశ్రేణి అథ్లెట్లు వివిధ కారణాలతో రాలేకపోవడం క్రీడాకారులతో పాటు అధికారుల్ని సైతం ఆశ్చర్యంలో ముంచేసింది. ఈ పోటీలు యువ అథ్లెట్లకు సువర్ణావకాశంగా పరిణమించినప్పటికీ సంతోషాన్ని ఇవ్వలేదన్నది నగ్నసత్యం. పసిడి పతకం సాధించిన పలువురు అథ్లెట్లు వారి విజయాన్ని గూర్చి విలేకరులకు తెలుపుతూ సీనియర్లు లేకపోవడంతో సునాయాసంగా గెలిచామని, తమ విజయం నల్లేరుమీద నడకగా సాగిందని, ఆసియా క్రీడల్లో వున్నంత పోటీ లేదని, ఫలితం సంతృప్తినిచ్చినా అగ్రశ్రేణి అథ్లెట్లు మీట్ పోటీలకు దూరంగా ఉండటం లోటుగా మిగిలిందని అన్నారు. అగ్రశ్రేణి అథ్లెట్లు సెప్టెంబరు నెలాఖర్లో మనిలాలో జరిగే ఆసియా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్‌కు ప్రాధాన్యాన్ని ఇచ్చారు. అందుకోసం అదే స్థలంలో జరిగే అంతర్రాష్ట్ర పోటీలకు వారు సమాయత్తమవుతున్నారని అధికారులు తెలిపారు. మరికొందరు వ్యక్తిగత కారణాల వల్ల రాలేదు.

గత రికార్డులు భద్రం

ఫెడరేషన్ కప్ పోటీలకు ఒక ప్రత్యేకత ఉంది. గతంలో నెలకొల్పిన రికార్డులు బద్దలు కొట్టి కొత్త మీట్, జాతీయ రికార్డులను సృష్టించడమే వీటి ప్రత్యేకత. కాగా ఈ ఫెడ్‌కప్‌లో మహిళా అథ్లెట్లు రెండు జాతీయ రికార్డులను నెలకొల్పగా, మరో రెండు మీట్ రికార్డులను పురుష అథ్లెట్లు బద్దలు కొట్టారు. ప్రతి ఫెడ్‌కప్‌లో 7 లేదా 8 రికార్డులు సృష్టిస్తారని ఆశించిన క్రీడాభిమానులను అథ్లెట్లు నిరాశకు గురిచేశారు. 20 కిలోమీటర్ల నడకలో పశ్చిమ బెంగాల్ క్రీడాకారిణి బాలాదేవి, మహిళల పోల్‌వాల్ట్‌లో కరమ్ జీత్ కౌర్‌లు జాతీయ రికార్డులు నెలకొల్పగా, సోలంకి, సురేఖలు జాతీయ రికార్డును సమం చేశారు. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో నౌనిధ్ సింగ్, డెకాథ్లాన్‌లో కుల్వీందర్ సింగ్, పోల్‌వాల్ట్‌లో గీష్ కుమార్, 400 మీటర్ల హర్డిల్స్‌లో ప్రసాద్ రెడ్డి, 800 మీటర్లలో ప్రిమేష్‌లు మీట్ రికార్డులను నెలకొల్పడం కొంత వరకు నిర్వాహకులను ఆనందపర్చింది.

అరకొర సౌకర్యాలతో ఇబ్బందికి గురైన అథ్లెట్లు

పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలనుండి, ప్రభుత్వ రంగ సంస్థల నుండి గచ్చిబౌలి స్టేడియానికి విచ్చేసిన అథ్లెట్లకు అధికారులు అరకొర సౌకర్యాలు కల్పించారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని కొందరు అథ్లెట్లు విమర్శించారు. భోజన ఏర్పాట్లను అధికారులు విస్మరించడంతో అథ్లెట్లు నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. స్టేడియంలో ఉన్న క్యాంటీన్ చిన్నదైనా అందులో విక్రయించే తినుబండారాల ధరలు మాత్రం భారీగా ఉన్నాయి. ఇకపోతే ఈ మీట్ కోసం వచ్చిన అధికారులు, అథ్లెట్లు మైదానంలోకి ప్రధాన ద్వారం నుండి కాక, మరో దారినుండి వెళ్లాల్సి వచ్చింది. ప్రధాన ద్వారం మూసేసి ఉండడం గమనార్హం. అథ్లెట్లు గేట్ నుండి దాదాపు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రధాన స్టేడియం వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ●

రాష్ట్రం 'శోభా'యమానం

ఈ పోటీల్లో రాష్ట్ర అథ్లెట్లు ఏడు స్వర్ణాలు, రెండు రజితాలు, రెండు కాంస్య పతకాలు సాధించి రాష్ట్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఏడింటిల్లో రెండు స్వర్ణాలను జె.జె.శోభ సాధించింది. లాంగ్‌జంప్‌లో 6.23 మీటర్ల ఎత్తు జంప్ చేసి ఒక స్వర్ణం సాధించగా, పోటీల ముగింపు రోజున హెప్టాథ్లాన్‌లో 5758 పాయింట్లు సాధించి మరో స్వర్ణం తన ఖాతాలో వేసుకుంది. పదివేల మీటర్ల పరుగుపందెంను శివానంద్ 32 నిమిషాల 31.32 సెకన్లలో పూర్తిచేసి స్వర్ణం అందుకున్నాడు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎస్.గీత పసిడి పతకం సాధించింది. 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో అరుణ్ డిసౌజా, 4×100 మీటర్లు, 4×400 మీటర్ల రిలేల్లో రాష్ట్ర మహిళా అథ్లెట్లు పసిడి పతకాలను సాధించి పెట్టారు. పురుషుల 4×100 మీటర్ల రిలే, 400 మీటర్ల హర్డిల్స్‌ల్లో పి.శంకర్ రజిత పతకాలు కైవసం చేసుకున్నాడు. మహిళల 5000 మీటర్ల పరుగుపందెంలో వనితా ఠాకూర్, పురుషుల 4×400 మీటర్ల రిలేలో రాష్ట్ర జట్టు కాంస్య పతకంతో సరిపెట్టుకొంది. దీంతో రాష్ట్రంలో 'అరువు' లేకుండా సొంత క్రీడ కూడా ఉందని ఎట్టకేలకు రుజువు చేశారు.



పాడి

"పనుల్లేకుండా ఒకరి ఎదురుగా ఒకరం ఎందాకా కూచుని తిందాం? కూచుని తింటే మనకేమన్నా తరిగిపోని ఆస్తిపాస్తులున్నయ్యా? ఇంటో వుండే రేషను బియ్యం ఇంక మూడు రోజులు పోతయ్యి! అయ్యి అయిపోయిన తరువాత అందరం పొస్తులు పొడుకోవాలో, ఇల్లిల్లూ తిరిగి అడుక్కుని తిని బతకాలో..." అంది వెంకమ్మ.

అన్నం కుండ పొయ్యిమీద పెట్టి, దానిముందు కూర్చుని మంటపెడుతోంది ఆమె. వానకి తడిసిన పుల్లలు ఎంతకీ రాజుకోకపోవడంతో గొట్టం పెట్టి పొయ్యి ఊదుతూ, ఎక్కువగా కమ్ముకుంటున్న పొగధాటికి వస్తున్న కన్నీరు తుడుచుకుంటూ ఎదురుగా మంచం వాల్చుకుని కూర్చున్న భర్త లింగయ్యతో అంది ఆమె.

"అయితే నువ్వనేదేందే ఇంతకీ?" విసురుగా అన్నాడు లింగయ్య.

"నేను అనేది ఏందా? పని చేసే ఈడులో వుండ మొగోడు చేతులు ముడుచుకుని కూచుంటే కూడు వచ్చిద్దీ? పనికి పోతేనే కుండ మాడిద్దీ లేకపోతే కడుపు మాడిద్దీ! ఏదో ఒక పని చేసుకోకుండా వూరక గోళ్ళు గిల్లుకుంటా, వళ్ళు యిరుచుకుంటా కూచుంటే కూడు ఎట్ట వచ్చిద్దీ?"

"నేను పనీపాటా చేయకుండా తిని కూచునే సోమరోడి మాదిరిగా కనపడతన్నానంటే నీకంటికి?"

"మరి... నువ్వు ఇయ్యాల్టికి పనికిపోయి ఐదురోజులవతంది! ఇంటికాడ వుండ ఈ ఐదు రోజుల్నించీ పూచిక పుల్ల ఎత్తు పని చేసా? తింటే కొండలైనా కరిగిపోతయ్యంట! ఈ ఐదు రోజుల్నించీ తినడమే తప్ప, తేవడం లేకపాయె!"

"పని వుంటే పోనంటే? పని లేకపోతే నన్నేం చేయమంటా?"

"మన ఇంటికి వచ్చి ఎవుడన్నా పనికి రమ్మని బొట్టూ కాటికా పెట్టి చెపతాడూ? అంతగా పనులు వుండయ్యి? చిన్నదో, పెద్దదో అమ్మా అయ్యా అని బతిమలాడో, బంగపడో కాళ్ళావేళ్ళా పడి చేసుకోవాలి పని! ఎతుకులాడుకుంటే పని దొరక్కుండా పోయిద్దీ?"

"నువ్వు ఎతుకులాడు... ఎతుకులాడుకుంటే బజార్లో దొరికే వస్తువంటే పనంటే... ఈ ముసురు పట్టి పేణం తీస్తంది కానీ, లేకపోతే చెట్లు కొట్టడానికో, మట్టిపనికో పోకపొయ్యానా?"

"ముసురు లేనప్పుడు తెగబడి చేసా?"

"అయితే నేను పనికి పోవటం లేదన్నమాట! అస్సలు పనులే లేకపోతే నన్నేం చేయమంటావే? ఏ రోజు ఏ చిన్న పని దొరికినా పోతానే వుండా గదా! ఈ టాకటేర్లూ, మిషన్లూ వచ్చిన తరువాత పొలంలో పనికి పిలిచేవాడు లేకుండా పోయాడు. అన్నీ అయ్యే చేస్తండే. ఇక మడుసుల తోటి పనేం వుందీ?"

"అసుమంటప్పుడు మనం ఇంకో మార్గం చూసుకోవాలి, బతకాలిగదా! పనులు లేవంటే కడుపులో ఆకలి వూరుకునిద్దీ? దాన్ని చల్లార్చుకోవాలిగా! ముందుముందూ పన్లు ఇంకా తగ్గుతయ్యిగానీ పెరగవు!"

"నిజమే, మరేం చెయ్యాలి? ఇంకోదారి చూసుకోవటం అంత తేలికా? రెక్కల కష్టం తప్ప మనకేం చేతకాదాయె!"

నిజానికి లింగయ్య ఎక్కడ ఏ చిన్న పని దొరికినా వెళ్ళేవాడు. ఆ విషయం వెంకమ్మకీ తెల్సు. కానీ ఈ మధ్యకాలంలో పనులు సరిగా లేకపోవడంతో కలుగుతున్న అసహనంతోనే ఆమె భర్త మీద కోప్పడుతోంది కానీ నిజం తెలియక కాదు.

"ఈ మాటలు కాదుకానీ బర్రెని ఒకదాన్ని కొనుక్కుందామయ్యా! పనికోసం ఒకర్ని దేబిరించాల్సిన అవసరం వుండదు. బర్రెపాలు కేంద్రానికి పోసుకుందాం. పాడిమీద కూలిపాటైనా డబ్బులు రాకుండా వుంటయా? మొన్న ఎండాకాలం అంతా ఒకరోజు పని దొరికితే నాల్రోజులు పనీపాటా లేదు. బర్రె వుంటే దాన్ని మేపుకుంటే సరిపోయిద్ది మనకి. పాడిమీద రోజుకి ఎంతోకొంత వస్తయ్యి. ఉప్పుకో పప్పుకో ఒక్కర్చు ఎల్లబారిపోయిద్ది!" అంది వెంకమ్మ.

"బర్రెని కొంటే దాన్ని కట్టేసే మెల్లా ఎక్కడుంది? ఇంటి ముందు జానెడు జాగా లేకపోయె మనకి!"

"ఎక్కడోచోట మీనా భూమిలో కట్టేసి నువ్వు అక్కడ పొడుకో!"

ఆలోచించి చూస్తే బర్రెని కొనుక్కోవటమే నయమనిపించింది లింగయ్యకి కూడా.

"మరి డబ్బు ఎట్ట చేద్దామే? కొనుక్కునేది ఏదో మంచిదాన్ని చూసే కొనుక్కుందాం. ఎలాగూ ఒకరికి పని వుండిద్ది కాబట్టి కాసిన్ని పాలు ఇచ్చేదాన్ని కొనుక్కోవటం నయం. డబ్బెట్టా?"

"బేంకిలో ఆరువేలు వుండయ్యి గదా! వాటికి తోడు ఇంకో నాలుగువేలు అప్పు తెద్దాం. వాలు కుదిరితే రెండు మూడు నెలల్లోనే తెచ్చిన బాకీ సుబ్బరంగా తీర్చిపారెయొచ్చు!"

"మనకి సెంటు భూమి లేకపాయె! అర ఎకరం పొలం కౌలుకి దొరికితే బాగుండు, మేత ఎదపెట్టుకోవచ్చు. ఎప్పుడూ పని చేసే వాడికి పని లేకపోతే ఎదవ బుద్ధులు అలవడతయ్యి. సోంబేరితనం పెరిగిద్ది. బర్రెని మేపుకోవటం నయమేనే! గట్టిగా కొనాలి. ఇద్దరం చేసే ఈడులో వుండాం. సంపాయిచ్చుకోలేకపోయినా ఒకరికి బాకీ లేకపోతే అదే పదేలు!" అన్నాడు లింగయ్య.

ఆ రోజు అంతా బర్రె విషయమే ఇద్దరూ మాట్లాడుకున్నారు. రకరకాలు చర్చించారు.

చీకటి పడింది.

వెన్నెల ఆహ్లాదకరంగా, మనోహరంగా వుంది.

అన్నం తిని, పొగాకు కొనుక్కోవటానికి కొట్టు దగ్గరకి బయల్దేరుతూ లింగయ్య అన్నాడు.

"గొడ్ల దళారి నారాయణకి చెపతానే మంచి బర్రె ఎక్కడైనా వుంటే చూడమని"

"అట్నే చెప్పు" అంది వెంకమ్మ.

కొట్టుకి వెళ్ళేదారిలోనే గొడ్ల దళారి వ్యాపారం చేసే నారాయణ ఇల్లు.

లింగయ్య వెళ్ళేసరికి ఆయన ఇంటి ఎదురుగా వున్న షావుకారు వీధి అరుగు మీద కూర్చుని ఎవరితోనో పెద్ద పెద్దగా, బడాయిబడాయిగా మాట్లాడుతున్నాడు.

నారాయణ మాటల పుట్ట, ఉన్నవీ, లేనివీ కల్పించి చెప్పడంతో పాటు గొడ్లు కావాలని ఎవరైనా వచ్చినా, అమ్మాలని వచ్చినా ఇకవాటి పని పూర్తి చేసే వరకూ నిద్రపోయే మనిషి కాదు.

లింగయ్య ఆయనకి విషయం చెప్పాడు.

"అమ్మకానికి ఐదారు గొడ్లు వున్నయ్యిరా. ధరలు ఎనిమిది వేల నించీ ఇరవై వేల దాకా వున్నయ్యి! నీవు గట్టిగా కావాలంటే తెల్లారి పొద్దున్నే రా! సద్ది బువ్వల యేళకి తోలక రావచ్చు. డబ్బు చూసి పెట్టుకున్నావుగా?" అన్నాడు నారాయణ.

"పదీ పన్నెండేలల్లో చూడు నారాయణ అన్నా! మరీ పెద్దదీ, మరీ చిన్నదీ కాకుండా మధ్యస్తంగా చూడు"

చూద్దాం లేరా! నీకు ఏ ధరలో కావాలంటే ఆ ధరలో తొలకొచ్చుకోవచ్చులే, దాందేముంది?"

"పొద్దునే వస్తా అన్నా" అని, ఇంటికి వచ్చి

భార్యకి విషయం చెప్పాడు లింగయ్య.

మరుసటి రోజు పొద్దున్నే లింగయ్య లేచి నీళ్ళు తెచ్చుకుంటుంటే నారాయణే వచ్చాడు.

"ఏరా లింగయ్యా... బర్రె కావాలని వస్తివే! రాచపూడిలో నాలుగైదు గొడ్లు వున్నయ్యి! చూసి వద్దాం రా. నచ్చితే బయానా ఇచ్చిరేపో మాపో తోలకొచ్చుకోవచ్చు"

"నేనే మీ ఇంటికి వద్దామనుకుంటన్నా. ఇంతలో నువ్వే వచ్చావు. వస్తున్నా కూచో!" అని లింగయ్య ఇంకో రెండు జోళ్ళు నీళ్ళు తెచ్చి నారాయణ వెంట బయల్దేరి వెళ్ళాడు.

రాచపూడి రెండు మైళ్ళ దూరం వుంటుంది. ఇద్దరూ నడిచి వెళ్ళారు.

"ముందు టిపినీ చేసి పోదాం. ఎండబడితే ఇక్కడ టిఫిన్ దొరకదు" అన్నాడు నారాయణ. అనుసరించాడు లింగయ్య.

హోటల్లో ఫుల్‌గా టిఫిన్ చేశాడు నారాయణ. లింగయ్య డబ్బులు ఇచ్చాడు.

ఊళ్ళో అమ్మకానికి వున్న నాలుగైదు గొడ్లు చూశారు. ఒకటి లింగయ్యకి నచ్చింది. ధర కూడా అనుకూలంగా వుంది.

14 వేల రూపాయలకి తగ్గదు రేటు. చూడి మీద వున్నప్పుడే 13 వేలకి అడిగారు" చెప్పాడు బర్రె ఆసామి.

"ఇంతకీ ఎన్ని లీటర్ల పాలు ఇచ్చిద్దీ?" లింగయ్య అడిగాడు.

"పిండుకుని చూసుకోండి మీకే తెలిసిద్ది. పూటకి మూడు లీటర్లకి తగ్గితే అప్పుడు అడగండి. అసలు ఇది మా ఇంటి గొడ్డు. నాణ్యమైన జాతి గొడ్డు. బుద్ధి కూడా మంచి బుద్ధి. మేత తొక్కుడు చేయదు. కుడితి ముట్టె ముంచి అడుగూ బడుగూ నాక్కుని తాగిద్ది. కొమ్ములిసరడం తెలవదు. పొదుగు దగ్గర ఎవరు కూచున్నా బుద్ధిగా పాలు ఇచ్చిద్దీ.." బర్రెగుణగణాల్ని వర్ణించి చెప్పడం మొదలు పెట్టాడు ఆసామి.

"ధరే మరీపిరిం" అన్నాడు లింగయ్య.

చివరికి దళారి బర్రె ఆసామితో పోట్లాడీ, లింగయ్యని సముదాయించీ, అటూ ఇటూ సర్దిపుచ్చి ధరని 13 వేలా 2 వందలకి ఖాయం చేశాడు.

వంద రూపాయలు బయానా ఇచ్చాడు లింగయ్య.

"సందకాడ మా ఆడదాన్నీ, మా బామ్మర్దినీ తీసకొచ్చి పాలు చూసుకుంటాం. మూడు లీటర్లకి తగ్గితే మాత్రం వప్పుకునేది లేదు. పాలు చూసుకుని రేపోమాపో మంచి రోజు చూసి తోలకపోతాం!" అని చెప్పాడు లింగయ్య.

సాయంత్రం లింగయ్య, భార్య వెంకమ్మ, ఆమె అన్నయ్య వెళ్ళి పాలు చూసుకున్నారు. అనుకున్న దాని కంటే పాలు ఎక్కువే ఇచ్చింది.

ఎప్పట్నించో బ్యాంక్‌లో దాచుకున్న డబ్బు తీసి, రెండు రూపాయల వడ్డీకి ఒకరి దగ్గర 5 వేలు తీసుకుని, ఇంట్లో వున్న డబ్బు మొత్తం కలిపి ఆసామికి చెల్లించి ఓ మంచి ఘడియన బర్రెని ఇంటికి తోలుకు వచ్చారు లింగయ్య దంపతులు.

ఇప్పుడు లింగయ్యకి చేతినిండా పని.

బాగా ఉదయమే లేచి పేడ కళ్ళు తీసి, చిమ్మి శుభ్రం చేసి, దానికి కుడితి పెట్టి, గంప తీసుకుని గడ్డి కోసుకురావడానికి వెళ్తాడు... గట్ల వెంటా, పుట్ల వెంటా తిరిగి గంపనిండుగా గడ్డి తీసుకువస్తాడు.

అన్నం తిని బర్రెని విప్పుకుని వాగుల వెంటా, వంకల వెంటా దాన్ని తోలుకుపోతాడు. సాయంత్రం 4 గంటల వరకూ మేపుకుని ఇంటికి తోలుకు వచ్చి కట్టిపడేసి, మళ్ళీ గంప తీసుకుని గడ్డికి వెళ్తాడు. .

పాలుతీయడం, కేంద్రానికి పోయడం వెంకమ్మ వంతు.

వాళ్ళ గుడిసెకి కొంచెం దూరంలో మీనా భూమి కొద్దిగా వుంటే అక్కడ బర్రెని కట్టేసుకుంటున్నారు. నాలుగు అడవి తుమ్మ కట్టెలు కొట్టుకు వచ్చి తాత్కాలికంగా పందిరి కూడా వేశాడు.

రోజూ ఉదయం మూడు లీటర్లూ, సాయంత్రం మూడు లీటర్లూ పాలు కేంద్రానికి పోస్తున్నారు.

ఊళ్ళో మూడు పాలకేంద్రాలు వున్నాయి. ఒకటి ప్రభుత్వ కేంద్రం, రెండు ప్రైవేట్ డైరీలు.

తను పాలు పోసే కేంద్రం వాళ్ళు శాతం

(మిగతా 23వ పేజీలో)



పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనుకబడతారు ?

రచన : జాన్‌హోల్ట్,
అనువాదం : డి.పాపారావు.
వెల : రు.60/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

ఒక దిక్సూచి

పిల్లలు నేర్చుకోవడంలో వైఫల్యానికి కారణం వారు భయానికి, విసుగుదలకు, గందరగోళానికి గురి కావడం. పనికి మాలిన విద్యార్థిగా భావించినవాడు తరగతి గది వెలుపల జీవితంలో ఎవరికీ తీసిపోని తెలివితేటలు, పరిణితి కలిగి ఉంటున్నాడు. అంటే ఏదో క్రమంలో ఎక్కడో అతని తెలివితేటలు చదువు నుండి తెగతెంపులై పోయాయి. ఎందుకు ?

కొంతమంది పిల్లలు ఉపాధ్యాయులు తమతో ఏదో చేయించాలని ఎందుకు కోరుకుంటారు ? అని ఆలోచిస్తారు. వారు చెప్పింది చేయకపోతే తమను తమ దారికి వదిలివేస్తారని వారి ఊహ.

ఉపాధ్యాయుడు తరగతి గదిని ఎంతటి ఆసక్తిదాయకంగా, క్షేమదాయకంగా ఉంచుదామని ప్రయత్నించినా పిల్లలు కొంతమంది దానిని ప్రమాదకరమైన ప్రదేశంగానే భావించి దానినుండి తప్పించుకునేందుకు తరగతి గదిలోనే పగటి కలలు కంటూ ఉంటారు.

పలు పాఠశాలలు క్రమ బద్ధతను సాధించేందుకు పిల్లలపై భయాన్ని, బెదిరింపును, శిక్షను వాడతాయి. అనవసరంగా పిల్లల్ని ఆలస్యంగా నేర్చుకుంటున్నాడని 'మానసిక వికలాంగుడని' ముద్రవేయడం జరుగుతూ ఉంటుంది. పిల్లలు ఎదుగుతూంటే వారు ఎటువంటి చికిత్సా అవసరం లేకుండానే ధారాళంగా, నైపుణ్యంగా మాట్లాడే సందర్భాలు ఎన్నెన్నో.

పిల్లల్ని 'చెడు' ప్రవర్తన పేరెట్టి శిక్షిస్తూ ఉంటారు. ఫలితంగా పిల్లవాడిలో తిరస్కార భావం తలెత్తుతుంది. శృతిమించిన పెద్దల ప్రవర్తన ఒక్కొక్కప్పుడు పిల్లల్ని బాల నేరస్థులుగా కూడా మారుస్తుంది.

వైఫల్యం, నిరుత్సాహం, భయం ఉచ్చులలో చిక్కిన పిల్లల్ని బయటకు లాగకపోతే వారు ఏ విధంగా మెరుగు పడగలరు ?

అసలైన నేర్చుకోవడం అంటే మనకు ఒక విషయం బాగా అర్థమవడం. అలా అర్థమయ్యిందంటే దానిని మనం అన్నిచోట్ల వినియోగించుకోగలుగుతాం. అదే విధంగా భిన్నాలు పిల్లలకు అర్థమయ్యేలా చేసేందుకు వాటిని సాధ్యమైనన్ని రకాలుగా ఉపయోగించే పద్ధతులను అన్వేషించడమే.

పిల్లలు ఆగమన తర్కంలో సమర్థులుగా వున్నా నిగమన తర్కంలో సమర్థులుగా లేకపోవడం రచయిత పరిశీలనలో ఒకటి. ప్రాథమిక స్థాయిలో గణితం పిల్లలకు ఎలా బోధించవచ్చునో రచయిత చాలా సోదాహరణంగా వివరించారు.

ఉపాధ్యాయులు బోధించేది పిల్లలు నేర్చుకోకపోవడానికి ఒక కారణం వారి మెదడులోని అంశాలను అదుపుచేసే ఉపాధ్యాయుల ప్రయత్నం పిల్లలలో ఆమోదించకపోవడమే.

చిన్నపిల్లలలో ఉండే గొప్ప గుణాలను అభివృద్ధి చేసేందుకు ఏదైనా ఒక మార్గం ఉండాలి. 'పరీక్షల' గురించి మాత్రమే ఆలోచించినంతకాలం మనం దేనినీ, ఎప్పటికీ చేయలేము.

'పిల్లలకు బోధించండి - వారిని పరీక్షించండి' అనే రీతిలో బోధన తయారయ్యింది. ఇది హెచ్చుమంది విద్యార్థులను గందరగోళంలోకి గెంటివేస్తోంది. ఎందుకంటే విద్యాపరమైన విజయాలు బలమైన పునాదులపై లేవని వారి నమ్మకం.

అంతేకాదు పాఠశాల అనేది అర్థరహిత ప్రశ్నలు, అర్థరహిత జవాబులు, అర్థరహిత క్రమానుగత తత్వాన్ని అనుసరించే చోటని చాలా మంది విద్యార్థులు నమ్ముతున్నారు. పిల్లలకు మనం మంచికంటే హాని ఎక్కువ చేస్తున్నామని అంటారు రచయిత.

నిజమైన ప్రేమాభిమానాలతో పరిశీలిస్తే పిల్లలు ప్రతి మాటకు మనం ఉత్సాహపడతాం. వారి పురోగతికి మనం దోహదపడగలం అంటారు. రచయిత జాన్‌హోల్ట్ కొలొరాడో, మసాచుసెట్‌లలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుడుగా పని చేశారు. ఆయన అనుభవాలను, పరిశీలనలను, పరిశోధనలను ఆసరాగా తీసుకుని రచించారు ఈ పుస్తకం. ఇదొక కోణం.

అనువాదం చేసినపుడు పాఠకుడు సులువుగా చదువుకుంటూ ముందుకు పేజీలు తిప్పే స్వేచ్ఛా శైలికి మరికొంత ప్రాధాన్యం ఇచ్చి ఉంటే ఇంకా బాగుండేది.

ఏ ప్రాంతమైనా మానవ ప్రవర్తనా విధానాలలో పోలికలు ఒకే విధంగా ఉంటాయి కాబట్టి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఈ పుస్తకం ఒక మేలు కొలుపుగా ఉపయోగపడుతుంది.

- సి.వి.సర్వేశ్వర శర్మ

స్వీకారం



బందరు కథంబం

సంపాదకుడు : బులుసు వెంకట కామేశ్వరరావు; **వెల :** రు. 20/-; **ప్రతులకు :** సీతా పబ్లికేషన్స్, 8-319/1, గొడుగుపేట, పురుషోత్తంవారి వీధి, మచిలీపట్నం



సాధారణ వ్యాధులకు హోమియో వైద్యం

రచన : డా॥ కె.ఉమాదేవి; **వెల :** రు. 20/-; **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



నిషిద్ధాక్షరాలు (కవితా సంకలనం)

రచన : నబి-రఫీ; **వెల :** రు. 25/-; **ప్రతులకు :** నబి, కరిముల్లాఖాన్, సాల్ట్ మర్చంట్, ఇస్లాంపేట-2, ఒంగోలు

⁕ చకిలం సురేందర్‌రావు

కృషి పట్టుదల ఉండాలేగాని ప్రతిభకు వయసుతో నిమిత్తంలేదని నిరూపిస్తుంది భువనగిరికి చెందిన బేబి దివ్యా కులకర్ణి. ప్రస్తుతం ఎనిమిదేళ్ళ వయసున్న దివ్య తన ఆరవ ఏటనుండే టీవి, సినిమాల్లో చూసిన డాన్స్‌లను యథాతథంగా వేస్తూ డాన్స్‌పై తన మక్కువను చాటుకొనేది. దివ్యలోని కళాభిరుచిని పసిగట్టిన ఆమె తల్లితండ్రులు కూడా దివ్యకు తగిన రీతిన ప్రోత్సాహాన్ని అందించారు. ఈ నేపథ్యంలో మొట్టమొదటి సారిగా గత సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో దివ్యతో నృత్య ప్రదర్శనను చేయించారు. తల్లి ప్రమోదిత, తండ్రి శ్రావణ్ కుమార్ ప్రోత్సాహం మెండుగా కలిగిన దివ్య ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని మొదటి సంవత్సరంలోనే ముప్ఫయి ప్రదర్శనలు పూర్తి చేయడం విశేషం.

నృత్యంలో రాణిస్తున్న దివ్య

పిట్ట కొంచెం.. ప్రదర్శనలు ఘనం

అదరక బెదరక అన్నట్లుగా సీనియర్ కళాకారులతో కలిసి దివ్య ఇప్పటికే అనేక ప్రదర్శనలు, వారి ప్రశంసలు పొందింది. వాటిలో నల్గొండ జిల్లాలోని బీబీనగర్‌లో ప్రముఖ సినీ హాస్యనటులు ఐరన్‌లెగ్ శాస్త్రి సరసన నృత్యం చేసి వందలాదిమంది కళాప్రియుల్ని వినోదింపచేయడం మరచిపోలేని అనుభూతిగా దివ్య తల్లితండ్రులు చెబుతూ ఉంటారు.

ఆడవే మయూరి నటనమాడవే..

సినిమా పాటలతోపాటు జానపద, శాస్త్రీయ నృత్యాలను సైతం తనదైన శైలిలో నర్తించి ప్రేక్షకులను రంజింపచేసే దివ్య గత నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రదర్శించిన దివ్య నృత్యాలకు విశేష స్పందన లభించింది. చౌటుప్పల్ డి.వై.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి డాన్స్ పోటీల్లో ప్రథమ బహుమతిని, అలాగే హన్మకొండలో శ్రీసాయిక్రియేషన్స్ నిర్వహణలో సోలో డాన్స్‌లో ప్రథమంగా నిలవడమే కాకుండా అనేక ప్రత్యేక బహుమతులు దక్కించుకుంది. భువనగిరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అఖిలభారత విద్యార్థి పరిషత్తు నిర్వహించిన ప్రత్యేక డాన్స్ కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులతోపాటు ప్రముఖుల ప్రశంసలు పొందింది. యాదగిరిలో ఎస్.ఎల్.ఎన్.ఎస్ డాన్స్ అకాడమీ జిల్లా స్థాయి డాన్స్ పోటీల్లో సోలో నృత్యాల్లో ప్రథమ, డ్యూయట్‌లో ద్వితీయ బహుమతులను దివ్య దక్కించుకుంది. కేవలం వేదికలపైన ప్రదర్శనలే కాకుండా బుల్లితెరపై కూడా తన నృత్య ప్రతిభను ప్రదర్శించిన దివ్య స్థానిక సిటీ ఛానల్ నిర్వహణలో డాన్స్ బేబి డాన్స్, ఇటీవల ఈటీవి నిర్వహణలో జోరుగా..హుషారుగా, మాటీవి డుండుం.. డిగాడిగా కార్యక్రమాల్లో పాల్గొని లక్షలాదిమంది టీవీ ప్రేక్షకులకు దగ్గరయ్యింది. నృత్యం తనకు నిత్య సాధన అయినప్పటికీ చదువులోనూ ప్రథమ ర్యాంకుల్లో నిలిచే దివ్య భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి వేదికలకు ఎదగాలని కోరుకుందాం!! ●



ప్రముఖ హాస్య నటులు ఐరన్ లెగ్ శాస్త్రితో స్టెప్పులు వేస్తున్న దివ్య

జానపద నృత్య ప్రదర్శన

✻ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

చదవని ఉత్తరం



గదిలో చీకటి...

రుద్రంగి నాగేశ్వరరావు ఒంటరిగా కూర్చున్నాడు.

మనసంతా దిగులు... అయోమయం లాంటి చీకటి... భవిష్యత్ అంధకారంగా కనిపిస్తోంది.... ఆలోచనలతో బుర్రంతా వేడెక్కిపోయింది.

ఘనమైన గతం కళ్ళముందు కదలింది. వందలాది రూపాయలు ఖర్చు పెడుతూ దర్జాగా గడిపిన జీవితం గుర్తుకు వచ్చింది.

'ఎలాంటివాడు ఎలా అయిపోయాడు!'

భావం తెలీని బాధ మనసును ప్రశ్నించింది.

నాగేశ్వరరావుకు జీవితం మీద ఎంతో అసహ్యం కలిగింది. 'ఎదిగిన ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయలేదు.. చక్కని జీవితాల్ని వారికి అందించలేదు... అందుకే ఈ లోకం నుంచి తాను దూరం అయిపోవాలి' అనుకున్నాడు.

కళ్ళల్లోంచి కన్నీళ్ళు బైటికి వచ్చాయి.

చీకట్లోంచి ఆకాశంలోకి చూశాడు.

ఎక్కడా చుక్కల్లేవు.. అంధకారం తప్ప.

తానొక్కడే చనిపోతే... ఒంటరి అయిపోయిన భార్య... వయసులో ఉన్న పిల్లలు ఏమవుతారు.... నాగేశ్వరరావులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

తలుపు చప్పుడైంది.

"ఇంకా పడుకోలేదా? చీకట్లో ఏమి చేస్తున్నారు?" భార్య రాణి ప్రశ్నించింది.

నాగేశ్వరరావు ఏం జవాబు చెప్పలేదు.

ఆమెతో కలిసి బెడ్‌రూంలోకి నడిచాడు.

* * *

నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన నాగేశ్వరరావు ఒకప్పుడు ధనవంతుడు. వ్యాపారంలో ఎంతో ఉన్నతికి చేరుకున్నాడు. లాభాలను ఆర్జించి గొప్పగా బతికాడు. అతని ముగ్గురు పిల్లలు సంతోషి నవత, పావని... చక్కగా చదువుకుంటూ చదువుల సరస్వతులుగా మంచి పేరు సంపాదించాడు.

సాఫీగా సాగిపోతున్న నాగేశ్వరావు కుటుంబం గాడి తప్పింది. సజావుగా సాగుతున్న వ్యాపారం ఒడిదుడుకుల్లో పడింది. వడ్డీలకు డబ్బులు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. నష్టాలు పెరిగిపోయి అప్పుల పాలైపోయాడు. ఉన్న ఆస్తులన్నీ కరిగిపోయాయి. కట్టుబట్టలతో మిగిలాడు.

రాజాలా బతికిన సూర్యాపేటలో తల ఎత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. పూలు అమ్మిన చోట కట్టెలు అమ్ముకుని బతకవలసిన దుస్థితి దాపురించింది. ఎదిగిన ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు ఎలా చేయగలనన్న బెంగ నాగేశ్వరరావును తీవ్రంగా కృంగదీసింది.

అప్పుడే మొదటిసారి జీవితం మీద విరక్తి కలిగింది. బతికి సాధించేది ఏమీ లేదని అనుకున్నాడు. ఆత్మహత్య చేసుకుని బాధల నుంచి విముక్తి పొందాలని నిశ్చయించుకున్నాడు.

* * *

నాగేశ్వరరావుకు సూర్యారావు మంచి మిత్రుడు.

వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబానికి ఎంతో సన్నిహితంగా మెదిలేవాడు.

ఆ రోజు నాగేశ్వరరావు సూర్యారావును కలిసి "చనిపోవాలనుకుంటున్నాను... డబ్బులు లేని అవమానాన్ని భరించలేకపోతున్నాను..." అన్నాడు.

"తప్పు నాగేశ్వరరావు... ఎప్పుడూ ఆ విధంగా ఆలోచించవద్దు... నీకేం తక్కువ? తెలివైన ముగ్గురు అమ్మాయిలున్నారు.. అణకువ కలిగిన భార్య ఉంది..."

"అదే నా బాధ.. వారికి నా వల్ల అన్యాయం జరగకూడదు... నేను తండ్రి అయినందుకు వారు బాధ పడకూడదు!" అన్నాడు.

తర్వాత ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు.

మనస్తత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన సూర్యారావు ఇంటిలోకి వెళ్ళి కాగితం తీసుకుని రాయడం మొదలు పెట్టాడు. ఆ కాగితాన్ని కవరులో పెట్టి నాగేశ్వరరావుకు అందించాడు.

"జీవితం మీద ఆశ కలిగే మాటలు రాశాను. మనసు బాధ పడినప్పుడు, జీవితం మీద విరక్తి కలిగినప్పుడు తీసి చదువుకో... నీకు స్వాంతన కలుగుతుంది" అన్నాడు.

నాగేశ్వరరావు ఆ కాగితాన్ని జేబులో పెట్టుకుని ఇంటికి వచ్చేశాడు.

తర్వాత టేబిలు మీద పెట్టాడు.

అందులో మిత్రుడు ఏమి రాశాడన్న విషయం తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా కలగలేదు...

నిరాశగా మంచం మీద వాలిపోయాడు.

* * *

ముగ్గురు కూతుళ్ళు సంతోషి... నవత... పావని... భార్య రాణిలను నాగేశ్వరరావు దగ్గర కూర్చోబెట్టుకున్నాడు. "అప్పుల బాధతో అవమాన భారంతో బతకడం దండగ అందరం ఒకేసారి చనిపోదాం..." అన్నాడు.

కొద్దిరోజులుగా తండ్రిలో వస్తున్న మార్పులను వారు కనిపెట్టగలిగారు.

"ఏమండీ! మీ మాటే... మా మాట... మీకు అవమానం జరిగితే మాకు జరిగినట్లే... మీరు లేకుండా మేం ఉండలేం!" అంది నాగేశ్వరరావు భార్య రాణి.

ముగ్గురు అక్కచెల్లెళ్ళు వంత పాడారు.

వారిలో ఉన్మాదం ఆవరించిన మాదిరిగా ఒక్కొక్కరు ఒక్కో కాగితాన్ని తీసుకుని తమ చావుకు ఎవరూ బాధ్యులు కాదని... తమ కష్టాలు మరెవరికీ రాకూడదని సంతోషి ఉత్తరం రాసింది... జరిగిన సంఘటన ఒక ఉదాహరణగా భావించి అందరూ జాగ్రత్తగా ఉండాలని నవత... కూతురి బాధ్యత తల్లిదండ్రులకు తోడుగా ఉండటమే. కాబట్టి వారితో కలిసి చనిపోతున్నానని, మళ్ళీ జన్మ అంటూ ఉంటే వారి మధ్యే పుట్టి సంతోషంగా ఉంటానని పావని ఉత్తరాలు రాశారు. భార్యాభర్తలు నాగేశ్వరావు, రాణిలు

రెండు వేర్వేరు ఉత్తరాలు రాసి తమ మిగిలిన ఆస్తులను, ఇన్సూరెన్స్ సొమ్మును అప్పుల వాళ్లకు పంచాలని అభ్యర్థించారు.

ఆ తర్వాత కూల్‌డ్రింకుల్లో విషం కలిపి అందరూ ఒకేసారి తాగారు.

గొంతులో దిగుతుండగా కళ్ళు మూతలు పడిపోయాయి. ఒకరి మీద ఒకరు ఒదిగిపోయి ప్రాణాలను వదిలిపెట్టారు... ప్రాణాలు క్రమంగా అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

* * *

నాగేశ్వరరావు కుటుంబ సామూహిక ఆత్మహత్యలు 15 సెప్టెంబర్ 2002న సూర్యాపేటలో సంచలనం కలిగించాయి.

అందరూ ఆశ్చర్యపోయారు.

ఎంతో మంచి భవిష్యత్ కలిగిన తెలివైన ముగ్గురు అమ్మాయిలు ఒకసారి చనిపోవడాన్ని వారి స్నేహితులెవ్వరూ జీర్ణించుకోలేకపోయారు.

ఆత్మహత్యలకు కారణం ఉత్తరాల ద్వారా తెలుసుకున్నా, ఒకే మాట మీద అందరూ ఈ చర్యకు ఎలా పాల్పడ్డారన్న విషయాన్ని ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు ప్రారంభించారు. వారి స్వదస్తూరితో రాసిన ఉత్తరాల ఆధారంగా కేసు నమోదు చేశారు.

ఆ సమయంలో టేబుల్ మీద ఉత్తరం కన్పించింది.

అందమైన దస్తూరితో సూర్యారావు రాసింది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చదివాడు.

"సమస్యలకు చావే పరిష్కారం అయితే ఈ ప్రపంచంలో ఒక్క మనిషి కూడా బ్రతికి ఉండదు. వేటగాడి బాణానికి బలవుతానని గ్రహించిన పక్షికాని, పులి పంజాకు చనిపోతానని గ్రహించిన లేడికూనగాని ముందుగా తన ప్రాణాలు తీసుకోదు.

బతకడానికి తెగువ చూపించాలి. తనువులు చాలించడానికి తెగువ చూపనవసరం లేదు. చావడమే లక్ష్యమైతే పుట్టడం దేనికి? ఆయుష్షు ఇస్తామంటే కొనుక్కోవడానికి, ఎంతైనా వెచ్చించడానికి కోట్లాది మంది సిద్ధంగా ఉన్నారు. ఆయువును కొనే అవకాశం లేని వాళ్ళం చావును కోరి తెచ్చుకోవడం ఏం న్యాయం... చావకు... చావుద్వారా మరికొంత మందిని చంపకు..."

ఈ విషయాలు ఆలోచింపజేశాయి.

కవరులోంచి బైటికి తీయని ఉత్తరం నాగేశ్వరావు చదవలేదని నిర్ధారణకు వచ్చాడు సి.ఐ.

ఆత్మహత్య చేసుకోవడానికి ముందు కనీసం ఒకసారి చదివినా నాగేశ్వరావు కుటుంబం ఈ విధంగా ఉండేది కాదని ఆయన అనుకున్నాడు. నిరాశా వాదులందరికీ ఈ ఉత్తరం ప్రింటు చేసి పంపిణీ చేస్తే ఎంతో ఫలితం ఉంటుందని భావించాడు. ●

పాడి

(19వ పేజీ తరువాయి)

సరిగా వేయడం లేదని ఒక రోజు వెంకమ్మ తగాదా పెట్టుకుంది.

"మేం శాతాలు వేసేది ఏంటమ్మా? ఇది ఎలక్ట్రికల్ మిషన్. నీకళ్ళ ముందే నీకు శాతం కనపడుతుంది. నువ్వే చూడు. ఇంక మేం వేసేది ఏముంది?" అన్నాడు కేంద్రం అతను.

అతని మీద రెండు మూడు రోజులు తగాదా పెట్టుకుని, ఇక లాభం లేదని మరో కేంద్రానికి పాలు పోయడం ప్రారంభించింది.

ఈమెని రాబట్టుకోవడానికి వాళ్ళు మొదటి రెండు రోజులు ఒక మాదిరి శాతం వేసి, తరువాత శాతం తగ్గించి వేయడం మొదలు పెట్టారు. వాళ్ళ మీదా తగాదా పెట్టుకుంది.

"కేంద్రం వాళ్ళు సరిగా శాతాలు వేసి చావడం లేదయ్యా! మనం చేసేది ఏముంది? రోజంతా మేపుకుని తీసకపోయి వాళ్ళ ముకాన పాలు దారాదత్తం చేసి వస్తన్నాం! వాళ్ళ బాకీ తీరుస్తున్నాం!" అని వెంకమ్మ తిడుతూనే వుంది. పాలు పోస్తూనే వున్నారు.

మూడు నెలల్లోనే ఊళ్ళో రెండు రూపాయల వడ్డీకి తీసుకు వచ్చిన బాకీని పూర్తిగా తీర్చివేశారు.

"గడ్డిదొరకడం కనాకష్టంగా వుందే! వెనకచిక్కి ఇంకో వాన వున్నట్టయితే ఇంకా 20 రోజుల పాటైనా దొరికేది గడ్డి. గడ్డి కోసం ఇప్పుడు రెండు మూడు మైళ్ళు పోవాల్సి వస్తంది. తిరిగి తిరిగి ఎతుకులాడుకుని దోక్కుని వస్తన్నా! ఇంక గడ్డి దొరకడం కష్టమేనే!" అన్నాడు లింగయ్య ఒకరోజు.

శివరాత్రి పండుగ పోయింది. ఎండలు ముదురుతున్నాయి.

లింగయ్య బాగా వేకువ జామునే లేచి గంప తీసుకుని పోయి ఎక్కడ గడ్డిపరక వుందనుకుంటే అక్కడ దోక్కుని వస్తున్నాడు. దోకుడు పారతో భూమిని అంటిపెట్టుకుని వున్న గడ్డిని ఎంత దోక్కున్నా, ఎంత కష్టపడినా గంప నిండటం లేదు. ఎక్కువగా గడ్డి వుంటే కొద్దిసేపట్లోనే గంప నిండుగా కొడవలితో కోసుకునే వాడు. ఐదు గంపల గడ్డి కోసే సమయం పదుతోంది. ఇప్పుడు ఒక గంప కోయడానికి.

"ఒక బండి వరిగడ్డి కొందామే. నేను తెచ్చే గడ్డి ఒక మేతకీ, వరిగడ్డి ఒక మేతకీ మేపుకోవచ్చు!" అన్నాడు భార్యతో.

"ఇంతకుముందు పదివందలు అమ్మేవరిగడ్డి బండి ఇప్పుడు నాలుగువేలంట! అంత ధర పెట్టి గడ్డికొని మనం బర్రెని ఏం మేపుతాం?" అంది వెంకమ్మ.

కానీ గడ్డి కొనక తప్పలేదు. 21 వందలు పెట్టి అరబండి వరిగడ్డి కొన్నారు.

ఎక్కడా దొరక్కపోవడంతో లింగయ్య పచ్చగడ్డికోసం పోవడం మానుకున్నాడు.

పగలంతా బర్రెని ఎక్కడోచోట తిప్పుకుని వచ్చి, రాత్రిపూట వరిగడ్డి వేస్తున్నారు.

21 వందలు పెట్టి కొన్న అరబండి గడ్డి 50 రోజులు పోయింది.

ఇక మళ్ళీ గడ్డి కోసం తిప్పలు తప్పలేదు. ఊళ్ళో వరిగడ్డి మోపు ధర 40 రూపాయలు చెపుతున్నారు.

అలాంటి మోపులు రెండు అయితే ఒక బర్రెకి ఒక రోజుకి సరిపోతాయి.

వీళ్ళు మూడు మోపులు కొని వాటిని రెండు రోజులు జాగ్రత్తగా మేపుతున్నారు.

కేంద్రానికి రోజూ 5 లీటర్ల పాలు పోస్తున్నారు. పాలశాతాన్ని బట్టి కేంద్రం వాళ్ళు లీటర్‌ధర 9, 10, 11 రూపాయలు వేస్తున్నారు. రోజుకి 45 నించీ 50 రూపాయలు వస్తున్నాయి.

"గడ్డి 40 రూపాయలూ, తౌడు 10 రూపాయలూ లెక్కన దీని కర్చు రోజుకి 50 రూపాయలవుతుంది. ఇట్ల గడ్డికొని మనం బర్రెని మేపడానికేనా? కేంద్రం చచ్చినోళ్ళు శాతాలు వేసి చావకపోతండ్రి. శాతం వేస్తే నాల్రూపాయలు మిగుల్తయ్ కానీ ఇట్టరూపాయి ఆదాయం లేకపోతే బర్రెనిమేపి ఏం లాభం? లాభం లేకపోతే పింగూ పోయే పైగా దానికి ఎదురు ఎక్కడ తీసకొచ్చి పెడతాం?" అని లబోదిబోమని నెత్తీనోరూ బాదుకుని బాధపడింది వెంకమ్మ.

"చేలమ్మటా, చెలకలమ్మటా తిరిగి గడ్డికోసుకొచ్చి మేపుకుంటే మనకి నాల్రూపాయలు కనపడినయ్యి కానీ మేపటం మనకి అయ్యే పనికాదు" అన్నాడు లింగయ్య.

ఏం చేయాలో ఇద్దరికీ అర్థం కాలేదు. పాలమీద వచ్చే డబ్బు కంటే బర్రెమేతకి పెడుతున్న ఖర్చు అధికంగా వుంది.

"రైతుకానీ, కూలోడు కానీ బతికే రోజు కాదయ్యా? శెట్టి కొట్లో మంచినీళ్ళ సీసా 13, 14 రూపాయలు అమ్ముతున్నాడు. అసుంటిది, లీటరు పాలు వచ్చి పదిరూపాయలా? నీళ్ళకి వుండ గిరాకీ పాలకి లేకపోతే ఇంకెందుకూ బర్రెని మేపుకోవటం?" అంది నిరాశగా వెంకమ్మ.

"ఎందుపాసో, పందుపాసో మేసిద్దని పొగులంతా ఎండకీ, గాలికీ తిప్పుకుని వస్తన్నానా? పనిమాలా మడిసీ చెడిపోతండే, పైసా ఆదాయం కనపడకపోతండే! ఇంకెందుకూ దీన్ని మేపుకోవటం, దండగ తప్ప!" అన్నాడు లింగయ్య.

చివరికి ఇద్దరూ బర్రెని అమ్ముదామనే నిర్ణయానికి వచ్చారు.

ఎక్కడా మేత దొరక్కపోవడంతో బరిగొడ్లకి కూడా గిరాకీ తక్కువగా వుంది. కటికి వాళ్ళు తప్ప గొడ్లని కొనేవాళ్ళు లేకుండా పోయారు.

అమ్ముదామనుకున్న తరువాత అది రోజురోజుకీ భారంగా కనపడుతోంది. నడి ఎండల్లో పగలంతా దాన్ని తిప్పుకురావడం, రోజూ మేత కొనుక్కొచ్చి మేపడం, దూరం నించీ నీళ్ళమోత – వీటన్నిటితో బర్రె తొందరగా వదిలితే బాగుండు అని భావించారు.

దానిని అమ్మి పెట్టమని నారాయణ చుట్టూ తిరగడం ఎక్కువ చేశాడు లింగయ్య.

ఎవరో దూరప్రాంతపు బేరగాళ్ళువస్తే ఒకరోజు బర్రెని తెగనమ్మి వేశారు లింగయ్య దంపతులు. బర్రెపోవటంతో వాళ్ళకి నెత్తిమీద నించి పెద్ద బరువు దింపుకున్నట్లయింది.

లింగయ్య పలుగూపారా సిద్ధం చేసుకుని మరుసటి రోజునించీ తనకి పని ఎక్కడ దొరుకుతుందా, ఎవరు పనికి పిలుస్తారా అని ఎదురు చూడటం మొదలు పెట్టాడు.

ఇక లింగయ్యకి రోజూ పని కోసం ఎదురు చూపులే. వెతుకులాటలే! ●

"రెండు వర్గాల వారు పరస్పరం పోటీపడి తమతమ టాటా సుమోలను అతివేగంగా నడిపినందువల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ రెండు వర్గాలు రెండు రాజకీయ పార్టీల వారు. గాయపడిన మరో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉందని, అయితే మరణించే అవకాశాలు లేవని వైద్యులు తెలిపారు.

కాగా గ్రామాలలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరి ఇలా పరస్పరం బల ప్రదర్శనలు చేస్తున్న నేపథ్యంలో కొట్లాటలు జరిగే అవకాశం లేకపోలేదని పెద్దవాళ్లు అంటున్నారు. బల ప్రదర్శనల్లో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. పనికి ఆహార పథకంతో వచ్చిన నదమంత్రపు సిరే ఈ వర్గపోరాటాలకు కారణంగా వారు చెపుతున్నారు."

ఈ వార్తను చదివిన సుబ్రహ్మణ్యం తలపట్టుకోకుండా ఉండలేకపోయాడు. ఇది రాసిన వ్యక్తికి పరిశీలనాశక్తి ఉందిగాని, చెప్పాలనుకున్న భావాలకు తగిన భాషపడటం లేదని అతగాడు రూఢీచేసుకున్నాడు. ఇలాంటి వార్తలు చదివినప్పుడు అతడు చర్చ పెట్టకుండా ఉండలేడు. పెట్టాడు. ఆ చర్చే ఇది. పైన పేర్కొన్న వార్తలోని ఏ భాగం చదివినా మనకు తప్పులున్నట్లే అనిపించడం లేదు. మరి సుబ్రహ్మణ్యం చెపుతున్న తప్పులేమిటో చూద్దాం.

"రెండు వర్గాల వారు పోటీపడి టాటా సుమోలను.." ఈ వాక్యంలో వర్గాలు అని రాయడం తప్పంటాడు సుబ్రహ్మణ్యం. మనకు రచనా వ్యాసంగం, పత్రికా భాష మొదలై విస్తృతమవుతున్న తొలి రోజుల్లో వామపక్ష ప్రభావం కలిగి, కలగకపోయినా అనేక మంది రచయితలు పదాలను శాస్త్రీయ దృష్టినుంచే వాడారు. వర్గం అనే పదాన్ని వేర్వేరు ఆర్థిక స్వభావాలు కలిగిన వారికి వాడతారు. పేదలు, ధనికులు, భూస్వాములు, పెట్టుబడిదారులు, ఇలాంటి వాటిని వేర్వేరు వర్గాలని రాయాలి. ఇపుడు ఒకే వర్గ స్వభావం కలిగిన ఇరు ముఠాలను కూడా వర్గాలు అని రాస్తున్నారు. (కొందరు వ్యాసకర్తలు మాత్రం ఇందుకు మినహాయింపు). ఇదేమీ అవగాహన ? 'వర్గం' పదాన్ని అన్నింటికీ రాసినప్పుడు వాస్తవంగా 'వర్గాలు' గురించి రాయాల్సి వచ్చినప్పుడు ఏ పదం రాస్తారు అని ప్రశ్నిస్తాడు సుబ్రహ్మణ్యం. నిజమే సుమీ !

"మరణించే అవకాశాలు లేవని..." అనే వాక్యం గురించి కూడా మన సుబ్రహ్మణ్యం అభ్యంతరం పెట్టాడు. ఇందులో ఆయన అభ్యంతరమేమిటంటే గత వారం చెప్పినదే. మరణించే అవకాశం లేకపోవడం అంటే.. 'మరణించడం అనేది అవకాశం అనే కదా చెప్పడం. 'మరణం' అవకాశం ఎలా అవుతుంది? అవాంఛనీయమయినది అయితే. మరి ఎలా రాయాలి ? 'మరణం సంభవించే ప్రమాదం లేదని' అని రాయొచ్చు.

'కొట్లాటలు జరిగే అవకాశం లేకపోలేదని..." ఈ వాక్యమూ అలాంటిదే. కొట్లాటలు అవకాశం కాదు. దానిని ఎలా రాయాలి ? కొట్లాటలు జరిగే ప్రమాదం లేదని, (లేదా) తలెత్తదని అని రాయాలంటాడు సుబ్రహ్మణ్యం.

"ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని..." ఈ వాక్యంలో కూడా ప్రమాదం అవకాశం కాదని చెప్తాం. మరి ఎలా రాయాలి ? 'ప్రమాదాలు జరిగే ప్రమాదం లేదని" అని పునరుక్తులతో రాయలేము కదా ! మరి ఎలా ? ప్రమాదాలు జరిగే పరిస్థితి లేదని..." అని రాసుకోవచ్చు.

'అవకాశం' అనే పదాన్ని పాజిటివ్ ఉద్దేశాలకు, 'ప్రమాదం' అనే పదాన్ని నెగిటివ్ ఉద్దేశాలకు, 'పరిస్థితి' అనే పదాన్ని న్యూట్రల్ లేదా యథాతథ పరిస్థితిని తెలియజెప్పునప్పుడూ రాయాలంటాడు సుబ్రహ్మణ్యం. అతగాడి బాధ అర్థంచేసుకుందాం. రాసేవాళ్లందరం ఆ విధమైన జాగ్రత్తలను తీసుకుందాం. ●

గోదారి తల్లికి వందనాలు

ఆగస్టు 3 వ తేదీ సంచికలో ప్రచురించిన తల్లి గోదారి వ్యాసం బాగుంది. పుష్కరాలకు సంబంధించిన అనేక విషయాలను తెలిపారు. పవిత్ర గోదావరి మాత మన రాష్ట్రంలో ఉండటం మన భాగ్యం. చక్కటి అందాలతో విరాజిల్లే గోదావరి మాతను ఎన్ని సార్లు సందర్శించినా తనివి తీరదు.

-మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

వితంతువుల గ్రామం

ఆగస్టు 3వ తేదీ సంచికలో ప్రచురించిన 'విధిని ఎదిరించిన వితంతువుల గ్రామం' అనే రియల్ స్టోరీ చాలా బాగుంది. ఈ గ్రామం వివరాలను తెలుసుకొని స్పందించి అధికారులు సహాయం అందించడం మంచి విషయం.

బి. రంగాచారి, కుమారి, శ్రీనివాసపురం

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ఫోటో : కె.నరహరి